www.truepointnews.com
ESTD 2024

PointNewsDaily
pointnewsdaily

ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Hyderabad - Vijaywada - Delhi - Bengaluru

మంగళవారం 15, జూలై, 2025 | పేజీలు :12



రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం : రేవంత్ 2



కేంద్ర జల వనరుల శాఖ మంత్రికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ..! 3



4
ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త..!



5
వరంగల్‌లో వైద్యురాలు మృతి.. హత్య అంటూ బంధువుల ఆందోళన..!



# తెల్లరేషన్ కార్డుల పంపిణీ షురూ..

## తుంగతుర్తిలో లాంఛనంగా ప్రారంభించిన సీఎం..!

- **తెల్ల రేషన్ కార్డుల పంపిణీ దేశ చరిత్రలోనే చారిత్రాత్మకం**
- **రాష్ట్రవ్యాప్తంగా 5.61 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు**
- **అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు**
- **తెల్ల రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ**
- **ఆహార భద్రతకు పెద్ద పీట వేసింది సోనియాగాంధీ**
- **సోనియాగాంధీ అడుగు జాడల్లో రాష్ట్ర ప్రభుత్వం**
- **బీఆర్ఎస్ పాలనలో తెల్ల రేషన్ కార్డుల మంజూరుపై నిర్లక్ష్యం**

**టీపీఎన్, సూర్యాపేట :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని, పేదలకు సన్న బియ్యం ఇచ్చి గుక్కెడు ముద్ద పెట్టాలనే ఆలోచన కూడా ఆ ప్రభుత్వంలోని పెద్దలకు రాలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అదే సమయంలో రూ. 34.20 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవకుండా బెల్ట్ షాపులు తెరిచారని వ్యంగ్యంగా విమర్శించారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తుంటే, ప్రతిపక్షాలు తమ ప్రభుత్వంపై ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని, రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం, గుర్తింపు అని, ఇది పేదల ఆకలి తీర్చే ఆయుధమని అభివర్ణించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నీటి సౌకర్యం నల్గొండ జిల్లాకు అందుతోందని గుర్తు చేశారు.రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందని, అయితే రైతు భరోసాను ఎగ్గొట్టిందని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయని ఆరోపించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామని, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడానికి 18 నెలల్లో రూ. 6,500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తమ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఆయన హయాంలోనే కూలేశ్వరం అయిందని, దాని వద్ద ఉరి తీసినా తప్పు లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. స్థానిక నేతలను ఉద్దేశించి, మూడు అడుగుల నాయకుడు ఎగిరెగిరి పడుతున్నాడని, పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు తేలేదని మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడం గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదని, జగదీష్ రెడ్డి దొర ముందు చేతులు కట్టుకుని సోడా పోయడమే తెలుసని చురకలంటించారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ కూడా తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదని విమర్శించారు. నల్గొండ గడ్డ పోరాట యోధులను అందించిన గడ్డ అని, గతంలో గంజికి లేని మూడు అడుగుల నాయకుడు ఇప్పుడు బెంజ్ కార్లలో తిరుగుతున్నాడని జగదీష్ రెడ్డిపై వ్యంగ్య బాణం సంధించారు. తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, దీని ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని, మొత్తం 95.56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను శాఖ భారీ ఆపరేషన్..!

- **రాజకీయ పార్టీలకు విరాళాలు.. వైద్య ఖర్చుల పేరుతో ఖజానాకు గండి**
- **పలు అకౌంటెంట్ల కార్యాలయాలను టార్గెట్ చేసిన ఐటీ అధికారులు**

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను శాఖ పలు సంస్థలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలపై భారీ ఎత్తున దాడులు నిర్వహించి షాక్ ఇచ్చింది. నకిలీ పత్రాలు, క్లెయిమ్‌లతో ఆదాయపు పన్ను మినహాయింపులు పొంది ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేపట్టింది. దేశంలోని వివిధ నగరాల్లో సుమారు 200 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ దాడులు జరుగుతున్నాయి. ఆదాయపు పన్ను వసూలు విషయంలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ, గడువులు పెంచుతూ మధ్య తరగతి, వేతన జీవులకు ఊరటనిచ్చే ఐటీ శాఖ, ఇప్పుడు నకిలీ మినహాయింపులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా రాజకీయ పార్టీలకు విరాళాలు, ట్యూషన్ ఫీజులు, వైద్య ఖర్చుల కోసం నకిలీ పత్రాలు సమర్పించడం ద్వారా భారీగా ఖజానాకు నష్టం కలిగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నకిలీ పత్రాల తయారీ, సమర్పణలో సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థలు, అకౌంటెంట్ల కార్యాలయాలపై దాడులు నిర్వహిస్తున్నారు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం రాజకీయ పార్టీలకు విరాళాలు, పిల్లల ట్యూషన్ ఫీజులు, వైద్య ఖర్చులను రిటర్న్‌లలో మినహాయింపులుగా చూపించవచ్చు. అయితే, నకిలీ పత్రాలతో భారీ మినహాయింపులు క్లెయిమ్ చేసే ఘటనలు పెరిగాయి. ఈ అక్రమాలను అరికట్టేందుకు ఐటీ శాఖ గతంలో చేసిన ప్రయత్నాలు పూర్తిగా ఫలించలేదు. నకిలీ పత్రాలతో



మినహాయింపు రిటర్న్‌లు దాఖలు చేసిన వారికి ఐటీ శాఖ నోటీసులు పంపినప్పటికీ, సవరించిన రిటర్న్‌లు దాఖలు చేయని వారిని టార్గెట్ చేసి దాడులు నిర్వహిస్తోంది. ఈ దాడుల్లో అక్రమాలు గుర్తించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపుల్లో అక్రమాలను అరికట్టి, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐటీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.



# దివికేగిన అలనాటి అందాల తార..!

**టీపీఎన్, స్పెషల్‌డెస్క్ :**

మనసు పరమలించెనే..తనువు పరవశించెనే అనగానే గుర్తొచ్చేది ఆమే. శ్రీకృష్ణార్జున యుద్ధం సినిమాలో శ్రీకృష్ణుణి చెల్లిగా 'చిన్నన్నయ్యా' అన్న చిన్నపిల్లలా పిలుపు వినగానే శ్రవణానందం కలిగించే స్వరం ఆమెదే. జగదేక వీరుణి కథలో ఓ సఖి..ఓహో చెలి అనే పాటతో అందరి ఇష్టసఖిగా మారిన నాటి తరం మేటి నటి డాక్టర్ బి.సరోజా దేవి. పౌరాణిక, సాంఘీక, జానపద వంటి ఎన్నో గొప్ప చిత్రాలలో హీరోయిన్ గా నటించి బెంగళూరులోని తన నివాసంలో సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. 17 ఏళ్లకే హీరోయిన్ ఆమె... 1955 నుంచి సుమారు 30 సంవత్సరాలలో వరుసగా 161 చిత్రాలలో ప్రధాన కథానాయికగా నటించిన ఏకైక భారతీయ నటి కూడా ఆమే. తమిళం, కన్నడంతో పోలిస్తే తెలుగులో ఒకింత తక్కువే... 1957లోనే తెలుగులో పాండురంగ మహాత్యంతో ప్రవేశించింది... కానీ తమిళ ఇండస్ట్రీ మాత్రం ఆమెను తెలుగమ్మాయిలానే భావించింది.. ఆదరించింది. తమిళ సూపర్ స్టార్లు అందరూ ఆమెతో సినిమాలు చేసినవారే... తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో సరోజాదేవి నటించారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్‌లతో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. 1942లో కర్ణాటకలో జన్మించిన సరోజాదేవి 13ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 200కు పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో సినిమాలు అంటే ప్రమీలార్జున యుద్ధం, శ్రీకృష్ణార్జున యుద్ధం, రహస్యం, భాగ్యచక్రం, అమరశిల్పి జక్కన్న,ఆత్మబలం, సీతారామకళ్యాణం,భూలోక రంభ, ఇంటికి దీపం ఇల్లాలే, శకుంతల, మాయని మమత,విజయం మనదే, దాగుడు మూతలు, సీతారామవనవాసం, పెళ్లిసందడి, ఉమాచండీగౌరిశంకరులకథ , జగదేకవీరుని కథ, దానవీరశూరకర్ణ, మంచి చెడు, దాగుడు మూతలు, పండంటి కాపురం, పెళ్లి కానుక, అల్లుడు దిద్దిన కాపురం వంటి సినిమాలు గుర్తొస్తాయి... 1967లో పెళ్లయ్యాక కూడా బిజీ నటిగానే ఉంది.., కానీ భర్త మరణం తరువాత తను అంతకుముందు సంతకాలు చేసిన సినిమాలు పూర్తి చేసి, చాలా ఏళ్ల పాటు సినిమాలు చేయడం మానేశారు. సరోజా దేవి తండ్రి భైరప్ప పోలీసు శాఖలో ఉద్యోగి, తల్లి రుద్రమ్మ గృహిణి. 1967లో శ్రీ హర్ష అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆయన 1986లో మరణించారు. సరోజాదేవి ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని వారికి రామచంద్రన్, ఇందిరా అని పేర్లు పెట్టి పోషించారు. సరోజా దేవి తన తండ్రితో తరచుగా స్టూడియోలకు వెళ్లేది, ఆమె నృత్యం చేసిన తర్వాత ఆమె వాచిన పాదాలకు మసాజ్ చేసేవాడు... అంతగా ప్రోత్సహించేది ఆ కుటుంబం... కాకపోతే తల్లి మాత్రం స్విమ్ సూట్లు, స్లీవ్‌లెస్ బ్లౌజులు ధరించకుండా నిషేధం విధించింది... కానీ నాలుగు భాషల్లో ప్రఖ్యాత హీరోలందరి సరసన నటించడానికి ఆ డ్రెస్ కోడ్ అడ్డు పడలేదు...ఆమెను చూడగానే మనింట్లో ఆడపిల్లలా అనిపిస్తుంది. నిండుదనం, చురుకుతనం, మంచితనం, అభినయ నైపుణ్యం ఇలా ఎన్నో లక్షణాలు బి.సరోజాదేవిని శిఖరస్థాయికి చేర్చాయనడంలో సందేహం లేదు. 1950లలో కన్నడ, తమిళం, తెలుగు, హిందీ భాషలలో నటించిన అతి కొద్ది మంది నటీమణులలో ఆమె ఒకరు... చతుర్భాషా తార అని కొందరు పిలిచేవాళ్లు...ఎంజీఆర్ చిత్రాలకు ఆమె 'లక్కీ మస్కట్'... 26 సినిమాలు చేసింది ఆయనతో... ఫేమస్ తెరజంట... సేమ్, వాణిశ్రీ... మహిళలు ఆమె డ్రెస్సింగ్ సెన్స్‌ను ఆరాధించారు... ఆమె చీరలు మరియు బ్లౌజ్‌లు, ఆభరణాలు, కేశాలంకరణను అమ్మాయిలు బాగా అనుసరించేవాళ్లు... ఓ ఫ్యాషన్ ఐకన్ 1960ల కాలంలో . బి. సరోజాదేవి సినీరంగానికి చేసిన సేవలకు భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో గౌరవించింది. అనేక రాష్ట్ర, జాతీయ అవార్డులు ఆమె ఖాతాలో ఉన్నాయి. తమిళ్, కన్నడ, తెలుగు చలనచిత్ర పరిశ్రమల నుంచి ఆమెకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు లభించాయి. 2009లో ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, నాట్య కళాధర అవార్డులు అందుకుంది. 2007లో రోటరీ శివాజీ అవార్డు , ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు సౌత్ అవారర్డును సైతం సరోజాదేవి అందుకున్నారు. ఆమె 1998, 2005లో 45వ, 53వ జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీ అధ్యక్షురాలిగా వ్యవహరించారు. 2010లో, భారతీయ విద్యా భవన్ "పద్మభూషణ్ బి. సరోజాదేవి నేషనల్ అవార్డు"ను ప్రవేశపెట్టింది. ఇది ప్రదర్శన కళలలో కళాకారులను గౌరవించే జీవన సాఫల్య అవార్డుగా నిలిచింది. సరోజా దేవి వెండితెరపై చూపించిన విలక్షణమైన నటన, శీలవంతమైన ప్రవర్తన, విలువలతో కూడిన పాత్రలు ఎప్పటికీ ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతాయి. బి. సరోజాదేవి మిగిల్చిన కళా వారసత్వం భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా నిలుస్తుంది. ఏడు దశాబ్దాలు... 200 సినిమాలు... భారతీయ సినిమా చరిత్రలో అత్యంత విజయవంతమైన తారల్లో ఆమె పేరూ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుంది... ఓ దశలో హైలీ పెయిడ్ ఆర్టిస్టు ఆమె... అంత డిమాండ్ ఉండేది... నేటి తరాలకు ఆమె తెలియకపోవచ్చు... చాలా ఏళ్లు ఆమె ఫిమేల్ సూపర్ స్టార్... తెలుగు, కన్నడం, తమిళం, హిందీ భాషల్లోనూ సక్సెస్‌ఫుల్ స్టార్...అందుకే ఆమె మృతిపట్ల సినీ ప్రముఖులు, ఆమెను ఆరాధించే అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమెకు అశేష అభిమానుల తరపున అశ్రు నివాళి.

# అట్టహాసంగా రంగం కార్యక్రమం..వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భవిష్యవాణి..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని తెలిపారు. రాబోయే రోజుల్లో ఒక మహమ్మారి ప్రజలను వెంటాడే అవకాశం ఉందని, అందుకు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అగ్నిప్రమాదాల సంభవం ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సరిగ్గా పట్టించుకోవడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.స్వర్ణలత మాట్లాడుతూ, "నన్ను మొక్కే వాళ్లు ఉండాలి, నిందించే వాళ్లు ఉండకూడదు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించను, కానీ రక్తం చూపిస్తాను. పూజలను సక్రమంగా నిర్వహించాలి," అని సూచించారు. ఆమె మరోసారి భక్తులకు సందేశం ఇస్తూ, "ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయి. ఐదు వారాల పాటు పప్పు, బెల్లం, పసుపు, కుంకుమలతో సాక పోయండి. ప్రతి సంవత్సరం బోనాల సందర్భంగా ఏదో ఒక ఆటంకం కల్పిస్తున్నారు. నన్ను లెక్క చేయడం లేదు. నా కోరికలను ప్రతి ఏటా చెబుతూనే ఉన్నాను. నా బిడ్డలను కడుపులో పెట్టి చూసుకుంటాను," అని పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయ పరిసరాలు బోనాల సమర్పణ కోసం వచ్చిన భక్తులతో సందడిగా మారాయి. పోతరాజుల విన్యాసాలు, బోనాలతో ఊరేగింపుగా వచ్చిన మహిళలతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. దివ్యమంగళ స్వరూపిణిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకొని, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల భద్రత కోసం 2500 మంది పోలీసులను యంత్రాంగం రంగంలోకి దింపింది. సికింద్రాబాద్ పరిసరాల్లోని 40కు పైగా ఆలయాల వద్ద కూడా భక్తుల రద్దీ కనిపించింది. భక్తుల కోసం తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఆహారం అందించాయి.ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి భద్రత, ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకొని భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆదివారం నుంచి మంగళవారం ఉదయం వరకు ఫలహారం, తొట్టెల బండ్ల ఊరేగింపులతో భక్తుల తాకిడి భారీగా ఉంటుంది. మహంకాళి పోలీస్ స్టేషన్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. రంగం, భవిష్యవాణి కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఇక పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవం చివరి ఘట్టం ముగిసింది. పరిసర ప్రాంతాల్లో పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి జరిగే అన్ని పూజలను ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్వర్ణలత భవిష్యవాణి తర్వాత మాట్లాడుతూ, ఈ ఏడాది బోనాల జాతర ఘనంగా జరిగిందని, భక్తులు భారీ సంఖ్యలో వచ్చారని చెప్పారు. ఆషాఢమాస బోనాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధమని, అమ్మవారి కోరికల మేరకు బలి విషయంలో ప్రభుత్వం ఆలోచిస్తుందని, అగ్నిప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.








## కల్లును నిషేధించే కుట్రలు మానుకోవాలి..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

తెలంగాణ సంస్కృతిలో భాగం అయిన కల్లును నిషేదించే కుట్రలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాలు సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ఈ చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కల్లు గీత వృత్తిమీద లక్షలాదిమంది ఆధారపడి బతుకుతున్నారని... రాష్ట్రంలోని కల్లు దుకాణాల మీద ఎక్సైజ్ ఆఫీసర్లు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజుల నుంచి దాడులు నిర్వహిస్తూ తమ జీవనోపాధిని దెబ్బ తీస్తున్నారని వాపోయారు. కూకట్పల్లిలో లో జరిగిన సంఘటనను రాష్ట్రంలోని మొత్తం కల్లు దుకాణాలకు ఆపదించడం సరికాదని అన్నారు. కూకటపల్లిలో జరిగిన కల్తీ కల్లు ఘటనలో పలు అనుమానాలు ఉన్నాయని... సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిక్కర్ అమ్మకాలు పెంచేందుకు కల్లు గీత వృత్తి పట్ల దుష్ప్రచారం తగదని పేర్కొన్నారు.



## ఆయిల్ పామ్ సాగులో తెలంగాణను నెంబర్ వన్ చేయడమే లక్ష్యం

**టీపీఎన్, చేవెళ్ల :**

ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రాన్ని మూడు నెలల్లో దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలపడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని పెద్దవేడు గ్రామ రెవెన్యూ పరిధిలో గల పిసరి సురేందర్ రెడ్డి పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ సామర్థ్యానికి తగ్గట్టుగా ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని, దీనికి ప్రభుత్వం మొక్కలకు సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యంతో సహా రంగారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాలకు పూర్తి మినహాయింపు ఇస్తుందన్నారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేసినా డ్రిప్ ఇరిగేషన్‌కు పూర్తి మినహాయింపు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రెండేళ్లలో ఆయిల్ పామ్ సాగులో ఆంధ్రప్రదేశ్‌ను అధిగమించాలని రైతులను ప్రోత్సహించారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు ఆదాయం తెచ్చిపెడుతుందని, ఈ పంటకు చీడపీడలు లేదా పందులు, ఇతర పశువుల వల్ల నష్టం జరిగే అవకాశం లేదని మంత్రి వివరించారు. ఆయిల్ పామ్ ఉత్పత్తుల కొనుగోలు గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ కంపెనీలను ఏర్పాటు చేసి, వారు నేరుగా రైతుల వద్దకు వచ్చి సరైన ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సర్దార్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు మరియు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాలేరు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల..!

**టీపీఎన్, పాలేరు :**



ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ యూటీ పనులు పూర్తి చేసి పంట పొలాలకు నీళ్లు విడుదల చేసే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.కృష్ణానది ఎగువన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకోకపోగా సహకరించిందని, దీని వల్ల తెలంగాణ ప్రజలు ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిప్యూటీ సీఎం ఆరోపించారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంటే, శ్రీశైలం వద్ద రోజుకు 11 టీఎంసీల నీటిని ఆనాటి ఏపీ ప్రభుత్వం తరలించేందుకు ప్రాజెక్టులు కట్టిందని, దీనికి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించడం వల్ల ఖమ్మం జిల్లాకు చెందిన సాగర్ ఎడమ కాలువ రెండో జోన్‌కు, నల్గొండ జిల్లాకు కొంతమేర ఇబ్బందులు ఏర్పడ్డాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ, రాష్ట్ర భవిష్యత్తు గురించి దూరదృష్టితో ఆలోచించి, భవిష్యత్ తరాలకు మేలు జరిగేలా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాయని, దీని వల్ల ఈ రోజు సమృద్ధిగా నీళ్లు అందిస్తున్నామని భట్టి తెలిపారు. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణకు రావలసిన నీటి వాటాను సాధించేందుకు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేస్తుంటే, బీఆర్ఎస్ నేతలు బురద జల్లే ప్రయత్నం చేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర ప్రజలు దీనిని గమనించాలని డిప్యూటీ సీఎం కోరారు. గతంలో ఏపీ ప్రభుత్వం నీటిని తరలించకుండా అడ్డుకోవాలని కాంగ్రెస్ నేతలు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు వివరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో 60 శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, రాష్ట్రాన్ని అన్నపూర్ణగా, విత్తన భాండాగారంగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల వ్యవధిలో రైతులకు రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులు, మూడు నెలల్లో రూ. 21,000 కోట్ల రైతు రుణమాఫీ, 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ. 17,500 కోట్లు చెల్లించామని, సన్నధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. పాలేరు రిజర్వాయర్ నుంచి పంట పొలాలకు నీళ్లు విడుదల చేసే కార్యక్రమం రాష్ట్ర ప్రజలు తమకు కల్పించిన అదృష్టంగా భావిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. కృష్ణానదిపై పాలమూరురంగారెడ్డి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్, నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని చెప్పారు. గత వానాకాలంలో దెబ్బతిన్న సాగర్ ఎడమ కాలువ పైపులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేసి నీటిని అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ అంటే బహుళార్థక సాధక ప్రాజెక్టులు, వ్యవసాయం, కరెంటు అని, నీటిపారుదల, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



# రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం : రేవంత్

**టీపీఎన్, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, క్లాప్ కొట్టి షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం' చిత్రీకరణ జరగడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ దేశంలోనే విశిష్టమైన స్టూడియో అని ప్రశంసించారు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి పౌరాణిక గ్రంథాలు మన జీవనంలో అంతర్భాగమని, ఇలాంటి గొప్ప కథలను ప్రస్తుత తరానికి దృశ్యకావ్యం రూపంలో అందించాలని నిర్ణయించిన నిర్మాతలను అభినందించారు. తరం మారుతున్న ఈ సమయంలో ఆధ్యాత్మిక కథాంశంతో సినిమా తీయడం గొప్ప విషయమని కొనియాడారు. 40 ఏళ్ల క్రితం రామాయణం సీరియల్ టీవీలో వచ్చినప్పుడు రోడ్లు నిర్మానుష్యంగా మారేవని, ప్రజలంతా టీవీల ముందు కూర్చుని చూసేవారని గుర్తు చేశారు. ఆ సీరియల్ అంతటి ప్రజాదరణ పొందిందని నెమరువేసుకున్నారు. "రామోజీ ఫిల్మ్ సిటీ వంటి గొప్ప స్టూడియో తెలంగాణలో ఉందని చెప్పడం నాకు గర్వంగా ఉంది," అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఫిల్మ్ సిటీ చిత్ర నిర్మాణానికి మాత్రమే కాక, పర్యాటకానికి, రాష్ట్ర ప్రతిష్టకు కూడా ఎంతగానో దోహదపడుతుందని సూచించారు. తెలంగాణ భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలను వివరిస్తూ, 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకోసం '2047 విజన్ డాక్యుమెంట్' సిద్ధం చేస్తున్నామని, ఈ డాక్యుమెంట్‌లో సినీ రంగానికి ప్రత్యేక అధ్యాయం ఉంటుందని స్పష్టం చేశారు. "రామానంద్ సాగర్ రామాయణం సీరియల్ గతంలో సాధించిన విజయాన్ని 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' కూడా సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని సీఎం తన ప్రసంగాన్ని ముగించారు. ఈ చిత్రం తెలంగాణలో ఆధ్యాత్మిక చిత్ర నిర్మాణానికి కొత్త ఊపిరి పోస్తుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా సినీ రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై కసరత్తు

**టీపీఎన్, హైదరాబాద్:**



ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై గాంధీ భవన్‌లో పీసీసీ జిల్లా ఇంచార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ ఇంచార్జీలు, నియోజకవర్గ ఇంచార్జీలు, జనరల్ సెక్రెటరీలు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతలు, మండల అధ్యక్షుల రేసులో ఉన్న ఆశావహులు, జిల్లా కార్యవర్గం ఆశావహులు, అనుబంధ సంఘాల ఆశావహులతో మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. పార్టీలో కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని, ముందు నుంచి యాక్టివ్‌గా ఉన్నవారికి మండల అధ్యక్ష పదవుల్లో అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నెల 15 లోపు సంస్థాగత నిర్మాణం పూర్తి చేసేందుకు తుది కసరత్తు జరిగింది. గ్రామ శాఖ, వార్డు, బ్లాక్, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గం, అనుబంధ సంఘాల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ఇంచార్జీలు ఇచ్చిన షార్ట్‌లిస్ట్ ఆధారంగా కసరత్తు పూర్తి చేసి, పీసీసీ, ఎఐసిసీ ఇంచార్జీలకు పంపనున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీ కోసం పనిచేసిన వారందరికీ అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. మార్కెట్ కమిటీలు, పట్టణ అభివృద్ధి కమిటీలు, దేవాలయ కమిటీలు వంటి పెండింగ్‌లో ఉన్న నామినేషన్లను ఈ నెలాఖరు లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, ప్రతి గ్రామంలో పార్టీ విజయం సాధించేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, దీని ద్వారా కొత్త నాయకత్వానికి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధమవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. కింది స్థాయి నాయకులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తే పార్టీ బలోపేతమవుతుందని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మూడు జిల్లా డీసీసీ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, ఆంజనేయులు గౌడ్, పార్లమెంట్ ఇంచార్జీలు, ఉపాధ్యక్షులు బండి రమేష్, నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్, జనరల్ సెక్రెటరీలు జగదీశ్వర్ గౌడ్, ధరా సింగ్, ఉప్పల్ శ్రీనివాస్ గుప్త, నందిమల్ల యాదయ్య, చనగాని దయాకర్, అసదుద్దీన్, అబ్జర్వర్లు మెట్టు సాయి కుమార్, పవన్ మల్లాది తదితరులు పాల్గొన్నారు.



# మహిళా స్వశక్తి సంఘాలు క్రియాశీలకంగా పనిచేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు

**టీపీఎన్, మంథని :**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేసేందుకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ కేంద్రాలు, ఆర్టీసీ బస్సులు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం మంథని నియోజకవర్గ పరిదిలోని కాటారం, మహాదేవపూర్, మహా ముత్తారం, పలిమెల, మల్హార్ మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు, బాంక్ లింకేజీ, ప్రమాద భీమా, రుణ భీమా, మహిళా సంఘాలు ద్వారా నడుపుతున్న ఆర్టీసీ బస్సుకు అద్దె చెల్లింపులు, ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ను రెడ్ కో సంస్థ ద్వారా తిరిగి ప్రభుత్వం కోనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మహిళా సంఘాలు ద్వారా దాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యం మహిళల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. 36,34,751 లక్షల రూపాయలు ప్రమాద భీమా, రుణ భీమా 30 లక్షలు, బ్యాంకు లింకేజీ 10.30 కోట్లు, 69.03 లక్షలు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. డివిజన్ లో మొత్తం 3161 మహిళా సంఘాలలో 32070 మంది సభ్యులున్నారని తెలిపారు. మహిళలు తలచుకుంటే చేయలేనిది ఏమి ఉండదని ఇంట్లో వంట నుండి పిల్లల విద్యాబ్యాసం వరకు అన్నింటిలో మహిళలు ముందుంటారని తెలిపారు. గత 10 సంవత్సరాల కాలంలో మహిళలలకు పైసా కూడా వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని తెలిపారు. అవసరాన్ని బట్టి రుణాలు, వనరులు సమకూర్చి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసి వ్యాపార వేత్తలుగా తయారు చేయనున్నట్లు తెలిపారు. మీ శక్తి, యుక్తి కి వాణిజ్య, వ్యాపార, ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రభుత్వం గొప్ప ఆలోచనలతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా కోటి రూపాయలతో సోలార్ విద్యుత్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ప్రభుత్వానికి విద్యుత్ విక్రయించి సంఘాల సభ్యులకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. వారం రోజుల్లో మండలానికి 100 మంది మహిళలకు కుట్టు మిషన్లలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని డీఆర్డీవోను ఆదేశించారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. 200 లోపు ఉచిత విద్యుత్తు, 500లకు గ్యాస్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రుణమాఫీ, 9 రోజులలో 9 వేల కోట్లు రైతు భరోసా, రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు ద్వారా ఇందిరామహిళా శక్తి క్యాన్టీన్లు, వడ్డీలేని రుణాలు, దాన్యం కొనుగోలు కేంద్రాలు, యూనిఫామ్స్ కుట్టించే పనులు, గణపురం, మహాదేవ పూర్ లో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు ఇస్తూ ఆర్థికాభివృద్ధి కి కృషి చేస్తున్నట్లు వివరించారు. మహిళా సాధికారితకు టీము వర్కుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న 6 రైతు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5 లక్షలు చొప్పున 30 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయితా ప్రకాష్ రెడ్డి, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, 5 మండలాల సింగిల్ విండో చైర్మన్లు, సమ్మక్క సారక్క జిల్లా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు శ్రీలత, కార్యదర్శి రజిత తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర జల వనరుల శాఖ మంత్రికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖ..!

- **పెండింగ్ ప్రాజెక్ట్ అనుమతులకు విజ్ఞప్తి**
- **కృష్ణా బేసిన్‌లో ఆంధ్రా అక్రమంగా నీటిని మళ్లిస్తోందని ఫిర్యాదు**
- **ఇచ్ఛంపల్లి ప్రాజెకట్‌కు నిధులు కేటాయించాలని వినతి**

**టీపీఎన్, హైదరాబాద్ :**

తెలంగాణకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా మరియు గోదావరి నదీ బేసిన్‌లలో సమస్యలపై కేంద్రం వెంటనే చొరవచూపాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. ఇక ఆ లేఖలో ముఖ్యాంశాలు ఈ విధంగా ఉన్నాయి. "పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ఇప్పటికీ క్లియరెన్స్ రాలేదు. పాలమూరుకు మైనర్ ఇరిగేషన్ కంపోనెంట్ నుంచి సేవింగ్స్ 45 టీఎంసీలు, గోదావరి నీటిని కృష్ణా నదికి బదిలీ చేయడం ద్వారా తెలంగాణకు రావాల్సిన 45 టీఎంసీలు ఈ ప్రాజెక్టు వినియోగించుకోవాలని ప్రతిపాదించింది. గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ (GWDT) అవార్డు ప్రకారం 45 టీఎంసీల కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పైన వాడుకునే వీలుంది. ఆ నీటినే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టుల డీపీఆర్లను కేంద్ర జల సంఘం ఆమోదించాలి. ఆ తర్వాత పర్యావరణ శాఖ, CCకు EC జారీ చేయమని సిఫార్సు చేయాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం కారణంగా కరువు పీడిత ప్రాంతాల రైతులకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదు. ఈ ప్రాజెక్టులకు ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ వస్తే కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయంతో పాటు నాబార్డ్ లాంటి ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీతో రుణాలు పొందే వీలుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే 2007లోనే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఆమోదం పొందింది. ఫ్లోరోసిస్ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో డిండి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలని ప్రధాన మంత్రి కార్యాలయం 2010 డిసెంబర్ 10వ తేదీన ప్రతిపాదించింది. 2021 సెప్టెంబర్ 21న కేంద్ర జలసంఘానికి సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ (తుపాకులగూడెం బ్యారేజ్) డీపీఆర్ సమర్పించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి నోఆబ్జెక్షన్ లేనందున ఇంటర్‌స్టేట్ మ్యాటర్స్ డైరెక్టరేట్ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతోంది. ఛత్తీస్‌గఢ్ సూచనలను, నిబంధనల ప్రకారం అక్కడి భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ముంపు విషయంలో ఖరగ్పూర్ ఐఐటీ ఇచ్చిన నివేదిక లోని సిఫారసులను పాటించేందుకు సిద్ధంగా ఉంది. కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు ఏపీ అక్రమంగా నీటిని మళ్లిస్తోంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి +880 అడుగుల వద్ద 1.5 లక్షల క్యూసెక్స్ కంటే ఎక్కువ సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లిస్తోంది. ఏకంగా 841 అడుగుల నుంచి రోజుకు 8 టీఎంసీల నీటిని మళ్లించేలా ఏపీ కాల్వల నిర్మాణాలు చేపట్టింది. 797 అడుగుల వద్ద రోజుకు 3 టీఎంసీలు తీసుకెళ్లే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తో పాటు ముచ్చుమర్రి, మలయాల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మించింది. కృష్ణా నది నుంచి వరద నీటిని బేసిన్ వెలుపల ప్రాంతాలకు డైవర్ట్ చేస్తుంది. శ్రీశైలం అట్టడుగు నుంచి నీటిని డైవర్ట్ చేసే నిర్మాణాలతో రిజర్వాయర్ ఖాళీ అవుతోంది.



శ్రీశైలం, నాగార్జునసాగర్ మీద ఆధారపడ్డ జల విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. రోజుకు 10 టీఎంసీల చొప్పున 20 రోజులలో 200 టీఎంసీలు డైవర్ట్ చేసే సామర్థ్యముండటంతో తెలంగాణలోని ఇన్‌బేసిన్ అవసరాలకు విఘాతం కలుగుతోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందే కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో 287.06 టీఎంసీల సామర్థ్యంతో వివిధ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. కేడబ్ల్యుడీటీ-2 ముందు ఈ వాదనలను వినిపించాం. ఈ విచారణ త్వరగా పూర్తి కావాలి. 1979లో ఎస్ఎల్బీసీ, 1984లో మొదలైన కల్వకుర్తి, 1997లో నెట్టెంపాడు, 2013లో పాలమూరు రంగారెడ్డి, 2007లో డిండి, 2005లో కొల్లాపూర్, 2014లో నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. KWDTI అవార్డు ప్రకారం చేపట్టిన ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులివ్వాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇతర బేసిన్లకు నీటిని మళ్లించడాన్ని కేఆర్ఎంబీ అడ్డుకోవాలి. కృష్ణా జలాల మళ్లింపుపై నియంత్రణలు విధించాలి. ఇన్‌బేసిన్ అవసరాల విషయంలో కేఆర్ఎంబీ న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. నీటి ప్రవాహాలను ఖచ్చితంగా లెక్కించేందుకు టెలిమెట్రీ అమలు చేయాలి. టెలీ మెట్రి అమలుకు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ ఖాతాకు రూ.4.15 కోట్లు జమ చేసింది. ఇప్పటికీ ఏపీ పరిధిలో టెలీ మెట్రీ పనులు జరగలేదు. వీటిని వెంటనే ఏర్పాటు చేయాలని కేఆర్ఎంబీకి సూచించాలి. ఏపీ ప్రభుత్వం తుంగభద్ర నీటిని కేసీ కెనాల్ నుంచి హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ కెనాల్కు నీటిని డైవర్ట్ చేస్తోంది, ఇది KWDTI అవార్డును ఉల్లంఘించటమే అవుతుంది. అవార్డు ప్రకారం తుంగభద్ర నుండి వచ్చే ప్రవాహాలు కృష్ణా నదికి రావాలి. దానికి విరుద్ధంగా ఏపీ అనుసరిస్తున్న తీరుపై ఇప్పటికే తుంగభద్ర బోర్డుకు లేఖలు రాశాం. శ్రీశైలం రిజర్వాయర్ అడుగు నుంచి (+797 అడుగుల వద్ద) రోజుకు 3 టీఎంసీల నీటిని అవతల బేసిన్‌కు లిఫ్ట్ చేసేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ఏపీ ప్రభుత్వం చేపట్టింది. ఎన్జీటీ స్టే ఇచ్చినా పనులు కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభమయ్యే ముందు పూర్వ స్థితికి పునరుద్ధరించమని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలి. శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ డిశ్చార్జ్ కెపాసిటీని అనధికారికంగా పెంచుకుంది. 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకుంది. 44 వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న ఈ కెనాల్ను ఇటీవల 89 వేల క్యూసెక్కులకు పెంచుకుంది. శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ప్రమాదకరంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం పదే పదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ప్లంజ్ పూల్‌కు మరమ్మతులు చేపట్టలేదు. గత 67 సంవత్సరాలలో డ్యామ్ సైట్‌ను సందర్శించిన వివిధ నిపుణుల బృందాలు చేసిన హెచ్చరికలు పట్టించుకోలేదు. డ్యామ్ భద్రత, నిరంతర కార్యకలాపాలు, జల విద్యుత్తు ఉత్పత్తి, నీటిపారుదల అవసరాలు, తాగునీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలి.

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి భారీ మొత్తంలో నీటిని మళ్లించేలా ఏపీ నిర్మించుకున్న ప్రాజెక్టులతో విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. నాగార్జునసాగర్, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్బీసీ ఆయకట్టుకు నీటి కొరతతో పాటు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల లో గ్రీన్ పవర్ ఉత్పత్తి తగ్గిపోతోంది. 2007లో కేంద్ర ప్రభుత్వం AIBP సాయంతో తెలంగాణకు జీవనాడిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్ట్ చేపట్టింది. ఆదిలాబాద్లో తుమ్మిడిహెట్టి నుంచి 160 టీఎంసీల నీటిని 7 ఉమ్మడి జిల్లాలలో 16.40 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించింది. 2010లోనే కేంద్ర జలసంఘం ఈ ప్రాజెక్టుకు అనుమతించింది. 2016లో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరింది. ఇప్పుడున్న 20 టీఎంసీల కేటాయింపులను 80 టీఎంసీలకు పెంచాలి. గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల వాటాలో నుంచి 80 టీఎంసీలు ఈ ప్రాజెక్టుకు సర్దుబాటు చేయాలి. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఏఐబీపీ కింద ఆర్థిక సాయం అందించాలి. జాతీయ నదుల అనుసంధాన ప్రణాళికలో భాగంగా ఇచ్ఛంపల్లి కావేరి లింక్ కెనాల్ ప్రతిపాదనలున్నాయి. ఇచ్ఛంపల్లి నుంచి కావేరికి 148 టీఎంసీల నీటి బదిలీలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2024 మార్చిలో లేఖ రాసింది. గోదావరి బేసిన్ నుండి ఇతర బేసిన్‌లకు నీటిని బదిలీ చేసే విషయంపై చర్చలు జరగాల్సిన అవసరముంది. తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అవసరాలు తీర్చేందుకు 200 టీఎంసీల వరద నీటిని ఉపయోగించుకునేలా ఇచ్ఛంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించాలి. గోదావరిపై పోలవరం, ఇచ్ఛంపల్లి ప్రాజెక్టులు చేపట్టమని GWDT పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చుతున్నందున, అంతే సమానంగా ఇచ్ఛంపల్లి ప్రాజెకట్‌కు కేంద్రం నిధులు సమకూర్చాలని లేఖలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శల వెల్లువ..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి ఫైర్ అయ్యారు మాజీ మంత్రి కేటీఆర్. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందిస్తూ.. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా చేసిన సర్కార్ నిర్లక్ష్యం వల్ల కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయని మండిపడ్డారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయాన్ని దండగ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతులే ప్రశ్నిస్తున్నారన్నారు. రైతులకు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని కేటీఆర్ ట్వీట్ చేశారు. 'కాలం కాటేయడం లేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం కాటేస్తున్నది. కరువు కాటేయడం లేదు.. కాలువల్లో నీళ్లు వారించకుండా కాంగ్రెస్ కాటేస్తున్నది. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కక్షగట్టిన సర్కార్ నిర్లక్ష్యం మూలంగా కాలువల్లో నీళ్లకు బదులు రైతుల కన్నీళ్లు పారుతున్నాయి. అద్దాలమేడలో ఊరేగుతున్న అబద్ధాల కాంగ్రెస్ మూలంగా అంధకారంలో తెలంగాణ రైతన్న ఆందోళన చెందుతున్నాడు. దశాబ్దాల పాలనలో దండగ చేసిన వ్యవసాయాన్ని దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో పండగ చేస్తే .. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి దండగ చేశారు. కానీ పండగల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరేగుతున్నది. బీఆర్ఎస్ పాలనలో వచ్చిన కాళేశ్వరం నీళ్లు.. కాంగ్రెస్ పాలనలో ఎందుకు రావడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఆరువందల మీటర్ల ఎత్తున ఎగిసిన కాళేశ్వరం నీళ్లు సుమారు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించి సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ మండలంలో రావిచెరువు వరకు చేరి రైతుల పొలాలను తడిపిన నీళ్లు నేడెందుకు పారడం లేదని రైతన్నలు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ కింద 2001లో పూర్తయిన కాకతీయ వరద కాలువ 22 ఏళ్ల తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల మూలంగా 153 కిలోమీటర్లు ప్రయాణించి చివరి ఆయకట్టుకు చేరాయి. కానీ నేడు మేడిగడ్డ మరమ్మతులు చేయకుండా, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వ్యవసాయంపై కక్షగట్టిన కాంగ్రెస్ సర్కార్ రైతన్నలకు శిక్ష వేస్తున్నది. కాంగ్రెస్ కుట్రలను చేధిస్తాం. తెలంగాణ రైతన్నలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాడతాం' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# చింతకాని మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ..!

- **మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ**
- **ప్రతి వారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం..!**
- **రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**
- **రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబ ఉండొద్దు అనేది ప్రభుత్వ ఆలోచన**

**టీపీఎన్, చింతకాని :**



ఇందిరమ్మ ఇల్లు మొదలు పెట్టండి.. ప్రతివారం ఇంటి బిల్లులు చెల్లిస్తాం, మీరు ఎంత తొందరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటే అంత తొందరగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అన్ని రాజకీయ పార్టీలను పిలవండి, అందరూ కలిసి ముగ్గుపోసే కార్యక్రమాన్ని పండుగలా చేయాలి.. గృహప్రవేశానికి పిలవండి వచ్చి పాలుపంచుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరికి సంబంధించిన అంశమని, రాష్ట్ర ప్రభుత్వ హృదయాంతరాల్లోంచి వచ్చిన పథకం ఇది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన చింతకాని మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు."రాష్ట్రంలో ఏ కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రెండు పథకాలు ప్రజా ప్రభుత్వం హృదయాంతరాల్లోంచి వచ్చినవని, రాష్ట్ర ప్రజల పట్ల ప్రేమ, అభిమానంతో కూడిన నిర్ణయాలు" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పేరిట తాను చేపట్టిన పాదయాత్ర సందర్భంగా టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు రాలేదు, బయటికి వచ్చి చెప్పుకోవాలంటే భయం పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా రాష్ట్ర ప్రజలు నా చేయి పట్టుకుని నడిచారు, ధైర్యంతో వారి బాధలు చెప్పుకున్నారు ఆనాడే తాను స్పష్టం చేశాను వచ్చేది ఇందిరమ్మ ప్రభుత్వం ఆ ప్రభుత్వంలో పేదలందరికీ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక్కో ఇంటిని 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నాం ఒకే సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతుంది, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3,500 ఇళ్లకు తక్కువ కాకుండా నిర్మిస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. ఆర్థిక భారం అయిన వెనుకాడకుండా మొదటి సంవత్సరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు ఖర్చు చేసే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి అందుకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించగా రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల పెద్దలు మొదట నవ్వారు నవ్విన వారే ఆశ్చర్యపోయేలా మొదటి సంవత్సరం మహిళా సంఘాలకు 21,600 కోట్లు వడ్డీ లేని రుణాలు అందజేసినట్టు తెలిపారు. ఈనెల 12 నుంచి 20 వరకు రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ ఒక ఉత్సవం లా జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.రుణాలు ఇప్పిస్తాం ఇచ్చిన రుణాలు ఎక్కడ పెట్టుబడి పెట్టాలని, తీసుకున్న రుణం భారంగా మారుతుందని మహిళా సంఘాలు ఆలోచిస్తుంటే ప్రభుత్వం ముందుకొచ్చి మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయించి వారికి ప్రతి నెల ఖచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసి ఈ రాష్ట్రంలో అమలు చేస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా మహిళా సంఘాలకు ప్రతినెల ఆదాయం వచ్చేలా చేపట్టిన కార్యక్రమం దేశానికి ఆదర్శం, ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ ఈ తరహా కార్యక్రమం ఆలోచన, అమలు జరగలేదు అది కేవలం ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైంది అన్నారు. మహిళా సంఘాలతో 2,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయించేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ప్రభుత్వమే చేయిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు తాను ఒక పిలుపునిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఎవరైనా మహిళా సంఘాలు ముందుకు వచ్చి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం వ్యవసాయ భూములు లీజుకు అడిగితే ఇవ్వాలని రైతులను కోరారు. మహిళా సంఘాలకు రైతులు తమ భూమిని లీజుకు ఇవ్వడం ద్వారా ఎకరాకు ఏడాదికి 35 వేల ఆదాయం సంపాదించే అవకాశం ఉందని వివరించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించాయి గత పది సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ నేతలు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని గాలికి వదిలేయగా తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించింది అని డిప్యూటీ సీఎం వివరించారు.మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి 650 బస్సులను కొనుగోలు చేయించి ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ లీజు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి లీజుకు ఇప్పించగా కోటి రూపాయల ఆదాయం వచ్చింది ఆ చెక్కును ఇటీవలే ప్రజా భవన్లో మహిళా సంఘాలకు తన చేతుల ద్వారా అందించినట్టు డిప్యూటీ సీఎం వివరించారు. కొద్ది రోజుల్లోనే మిగిలిన 450 బస్సులను మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధిర నియోజకవర్గ నుంచి ఐదు బస్సులను ఆర్టీసీకి లీజుకు ఇచ్చిన విషయాన్ని తెలిపారు. మహిళలు వ్యాపారం చేసుకునేందుకు ఇండస్ట్రియల్ పార్కులో స్థలం కేటాయిస్తున్నాం, త్వరలో మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇండస్ట్రియల్ పార్కులను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మహిళా సంఘాలకు లోన్ బీమా సౌకర్యం కల్పిస్తున్నాం ఊహించని ప్రమాదం జరిగితే రెండు లక్షల రుణం మాఫీ అవుతుంది, మహిళా సంఘాల సభ్యులకు దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే పది లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రమాద బీమా సౌకర్యం సైతం కల్పించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు యూనిఫామ్ లు కుట్టే కార్యక్రమాన్ని మహిళా సంఘాలకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఇందు మహిళా సంఘాలకు కొట్టు పనిలో శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ సెంటర్లు పెడుతున్నామని, మధుర నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఇప్పటికే మిషన్లో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గృహ అవసరాలకు వినియోగించే వస్తువులను మహిళా సంఘాలతో ఉత్పత్తి చేయించే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వారికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, మహిళల పక్షాన ఇప్పటికే ఆర్టీసీకి ప్రభుత్వం ఉచిత ప్రయాణాల కింద 6,632 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మహిళా సంఘాలు ఉన్నతంగా ఆలోచించాలి, ఆత్మగౌరవంతో బతకాలి అందరం కలిసి తెలంగాణ రాష్ట్రాన్ని స్వర్గలోకంగా మారుద్దామని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.ప్రతి కుటుంబం బాధ్యత, భవిష్యత్తు ప్రజా ప్రభుత్వానిదే అందుకు అనుగుణంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం, ఇచ్చిన బియ్యం వండుకునేందుకు 500 కే గ్యాస్ సిలిండర్ అర్హులు ఉంటే ఇంకా అప్లై చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం ప్రతి ఇంటి సమాచారం తన వద్ద ఉంది త్వరలోనే ఆ సమాచారాన్ని చేరవేస్తానని తెలిపారు. పిల్లలు చదువుకునేందుకు రెసిడెన్షియల్ స్కూల్ అందులో నాణ్యమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ 200 శాతం కాస్మోటిక్ చార్జీలు ఇటీవలే ప్రజా ప్రభుత్వం పెంచిన విషయాన్ని వివరించారు. పిల్లలు చదువుకునేందుకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో ఇంగ్లీష్ మీడియం లో బోధించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల పెట్టుబడితో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు

# ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త..!

- ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త..!
- హైదరాబాద్‌లో కొత్త బస్ టెర్మినల్ ప్రతిపాదన
- ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలం గుర్తింపు
- ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**





నగరంలో రాష్ట్ర, అంతర్రాష్ట్ర బస్సుల కోసం మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అంతర్రాష్ట్ర బస్సుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరంలో ట్రాఫిక్‌జామ్ సమస్యల కారణంగా ఎంజీబీఎస్‌కు ..మహాత్మాగాంధీ బస్ స్టేషన్.. ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక బస్ టెర్మినల్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జాతీయ రహదారి 44కు పక్కనే ఆరాంఘర్‌లో 7.22 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీ గుర్తించింది. ఈ స్థలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ (ఐసీఎస్‌డబ్ల్యూ) భవనాలున్నాయి. వాటికి పరిహారంగా రూ. 6 కోట్లు చెల్లించేందుకు ఆర్టీసీ ముందుకు వచ్చింది. ఈ భూమిని ఆర్టీసీ బస్ టెర్మినల్‌కు కేటాయించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 2025 జనవరి 25న రెవెన్యూశాఖకు లేఖ రాశారు. అయితే ఆరు నెలలు దాటినా ఈ అంశం ఇంకా కొలిక్కిరాలేదు. ఈ భూకేటాయింపు ప్రతిపాదన రంగారెడ్డి కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. అయితే తొందర్లోనే గ్రీన్ సిగ్నల్ అందేందుకు ప్రతికూల వాతావరణం ఏర్పడినట్లు ఆర్టిసి అధికారులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే నగరంలో ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు అడుగు పడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రెండు ప్రధాన భారీ బస్ టెర్మినల్స్ ఉన్నాయి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (MGBS)హైదరాబాద్‌లోని అతిపెద్ద, ముఖ్యమైన బస్ స్టేషన్లలో ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు ఇది ప్రధాన కేంద్రం. ప్రతిరోజు లక్షలాది మంది ప్రయాణికులు దీని ద్వారా రాకపోకలు సాగిస్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని జూబ్లీబస్ స్టేషన్.. జెబిఎస్.. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సేవలందిస్తుంది. కొత్త బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే దక్షిణ తెలంగాణ జిల్లాల నుండి వచ్చే బస్సులకు, అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుండి వచ్చే బస్సులకు ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. ఇది ప్రయాణికులకు కూడా సమయం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగాన్ని ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**టీపీఎన్, హైదరాబాద్ :**

గత పది ఏళ్లలో నిద్రపోతున్న దేవాదాయ శాఖను అభివృద్ధి దిశగా నడిపిస్తూ , అన్యాక్రాంతమైన దేవాదాయ భూములను పరిరక్షిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగాన్ని మంత్రి ప్రారంభించారు. లోక కళ్యాణార్థం కోసం కాచిగూడలోని తుల్జా భవాని ఆశ్రమంలో ఈ యాగాన్ని అర్చకులు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దౌలతబాదు వాసుదేవ శర్మ , ఎండోమెంట్ అడిషనల్ కమీషనర్ కృష్ణవేణిలతో కలిసి మంత్రి మాట్లాడుతూ.... సకాలంలో వర్షాలు కురావడానికి... ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేందుకు ఇలాంటి యాగాలు ఎంతో అవసరం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ధూప దీప నైవేద్యం కోసం అర్చకులకు ఆర్థిక సహాయాన్ని ప్రారంభించారని... ఇప్పుడు అనేక గుళ్లను ఎంపిక చేసి 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. అయితే దానిని 30 వేలకు పెంచాలని అర్చకులు కోరుతున్నారని... ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలు అయ్యేలా కృషి చేస్తానని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు.



## మంత్రి సీతక్కతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ భేటీ



**టీపీఎన్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మరియు ఇతర సభ్యులు సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ తొలి మూడు నెలల కార్యకలాపాల నివేదికను మంత్రికి సమర్పించారు. గత మూడు నెలల్లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చేపట్టిన కార్యక్రమాల వివరాలు ఈ నివేదికలో ఉన్నాయి. వీటిలో జిల్లాల్లో కలెక్టర్లతో సమీక్ష సమావేశాలు. బాలల హక్కుల పరిరక్షణ కోసం చర్యలు, క్షేత్రస్థాయి పర్యటనలు, యూనిసెఫ్ నుంచి శిక్షణ, స్వచ్ఛంద సంస్థలతో సంప్రదింపులు, బాలల హక్కుల ప్రచార కార్యక్రమాలు, జిల్లా పర్యటనలు, శిశు విహార్ సందర్శనలు, ఇందిరా మహిళా శక్తి మిషన్ వర్క్‌షాప్, ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కూలీ పిల్లలకు భరోసా కార్యక్రమాలు, బాల్య వివాహాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు, బాల అదాలత్‌లు, బాల మేళాలు, అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాలు, బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ సందర్భంగా చార్మినార్‌లో కార్యక్రమాలు, అంగన్‌వాడి కేంద్రాల సందర్శన. కమిషన్ చేపట్టిన కార్యకలాపాలను మంత్రి సీతక్క అభినందించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం మరింత విస్తృతంగా పని చేయాలని సూచించారు.

## మంత్రి జూపల్లిని కలిసిన బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్

**టీపీఎన్, హైదరాబాద్ :**

ప్రముఖ బాలీవుడ్ నటుడు, జీటీవీ రామాయణంలో రాముడి పాత్రధారి, బుద్ధిజం ప్రచారకులు గగన్ మాలిక్ తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం బేగంపేట టూరిజం ప్లాజాలో మర్యాదపూర్వకంగా కలిశారు. గగన్ మాలిక్‌ను బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య మంత్రి జూపల్లికి పరిచయం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచ దేశాల్లో ప్రాచుర్యం కల్పించడం, వివిధ బౌద్ధ దేశాలను బుద్ధవనానికి రప్పించడం, వారి సాంస్కృతిక కేంద్రాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయడంతో పాటు ఈ ఏడాది అక్టోబర్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు సుమారు 100 మందితో గుల్బర్గా మీదుగా బుద్ధవనానికి పాదయాత్రగా రావడం తదితర అంశాలను ఈ సందర్భంగా చర్చించారు.



# హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

నగరంలో ఆక్రమణలపై ప్రజలు ఇక వెనక్కి తగ్గడం లేదు. ఎవరైనా సరే, ఎంతటి ఆక్రమణ అయినా సరే, హైడ్రా ప్రజావాణికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. వరద కాలువలు, చెరువులు, రహదారులు, పార్కులు, ప్రభుత్వ లేదా ప్రజా వసరాల కోసం ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణకు గురైనప్పుడు, స్థానికులు ఆధారాలతో సహా వివరాలను హైడ్రాకు అందజేస్తున్నారు. సోమవారం ఒక్క రోజులోనే హైడ్రా ప్రజావాణికి 61 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్‌లో గతంలో ఉన్న పరిస్థితులు, ప్రస్తుతం ఎలా మారాయో తెలుసుకొని, ఫిర్యాదుదారుల సమక్షంలో సంబంధిత సమస్యల పరిష్కార బాధ్యతను అధికారులకు అప్పగించారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కండాపూర్‌లో రాఘవేంద్ర షెల్టర్స్ కాలనీ సమీపంలోని ప్రెస్టిన్ IVY అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న 40 అడుగుల రహదారిని మూసివేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్లాట్ నంబర్లు 9 & 23, 44 & 53 మధ్య ఉన్న ఈ రహదారి మూతపడటంతో పబ్లిక్ పార్క్‌కు వెళ్లే మార్గం లేకుండా పోయిందని



వాపోయారు. అదే విధంగా, ప్లాట్ నంబర్లు 22 & 23, 24 & 26 మధ్యలోని మరో 40 అడుగుల రహదారి 7 అడుగుల మేర ఆక్రమణకు గురైందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రహదారులను వెంటనే తెరిపించాలని కోరారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం గ్రామంలోని సర్వే నంబర్ 307/1, 308/2,3,5లో ఉన్న 271 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలో ఏపీఎస్ఎఫ్‌సీకి చెందిన ఈ భూమిని తెలంగాణ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటికీ, కబ్జాదారులు దీనిని ఆక్రమిస్తున్నారని, కబ్జాలకు ప్రోత్సాహం అందిస్తున్నారని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కొంపల్లి మున్సిపాలిటీ, దూలపల్లి విలేజ్ ఇండస్ట్రియల్ ఏరియాలో 1967లో 157 ఎకరాలలో 1696 ప్లాట్లతో వేసిన లేఔట్‌లో 4 పార్కులు ఉండాల్సి ఉండగా, రెండు పార్కులు ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు నిర్ధారణ అయింది. మిగిలిన రెండు పార్కులను లేఔట్ వేసిన వారి వారసులే కబ్జా చేశారని, వీటిని కాపాడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం, మెట్టుకాని గూడెం పెద్ద చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని మత్స్యకార సంఘం ప్రతినిధులు హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. 26.3 ఎకరాల పరిధిలో ఉన్న ఈ చెరువు ఇప్పటికే 6 ఎకరాల వరకు కబ్జాకు గురైందని తెలిపారు. ఐదు చెరువుల నుంచి వచ్చే వరద నీటిని కాలువలను బైపాస్ చేసి, వర్షాకాలంలోనూ నీరు రాకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువు ఆనవాళ్లను తొలగించి కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ చెరువును అభివృద్ధి చేసి తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం శాంతినగర్ హౌసింగ్ సొసైటీ లేఔట్‌లోని సర్వే నెం.132లో ఉన్న 60 అడుగుల రహదారిని అక్రమంగా మూసివేశారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. లేఔట్ ఆమోదం సమయంలో ఈ రహదారి స్పష్టంగా ఉందని, ఇటీవల కొందరు చట్ట వ్యతిరేకంగా ఈ రహదారిని మూసివేసి రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నారని తెలిపారు.



## మల్లన్నపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు..!

తీన్మార్ మల్లన్నపై తెలంగాణ మహిళా కమిషన్‌కు తెలంగాణ జాగృతి మహిళా విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. చైర్ పర్సన్ నేరెళ్ల శారద అందుబాటులో లేకపోవడంతో మహిళా కమిషన్ సభ్యులు సుదం లక్ష్మీ, రేవతి రావు, ఉమ, అఫ్రోజ్ సహీనాకు లేఖ అందజేశారు. చైర్ పర్సన్ అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదు లేఖను తాను తీసుకోనని.. సభ్యులకే ఇవ్వాలని కమిషన్ సెక్రటరీ పద్మజా రమణ సూచించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడంతో మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మల్లన్న తన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పకపోగా ఈరోజు అంతకన్నా తీవ్ర స్థాయిలో ఎమ్మెల్సీ కవితను దూషించిన విషయాన్ని మహిళా కమిషన్‌కు జాగృతి నాయకులు వివరించారు. మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## జీడిమెట్ల,జగద్గిరిగుట్టలో కల్తీ కల్లు కలకలం..!

**టీపీఎన్, మేడ్చల్ :**

జీడిమెట్లలో కల్తీ కల్లు కలకలం రేపింది. రెండు రోజుల క్రితం గాజుల రామారంలో నివసిస్తున్న కూతురు రేఖ ఇంటికి లచ్చిరాం, సాక్రిభాయ్ అనే దంపతులు వచ్చారు. ఊర్లో ప్రతిరోజు కల్లు తాగే అలవాటు ఉండటంతో, రామ్ రెడ్డి నగర్ లోని కల్లు దుకాణంలో ఆదివారం సాయంత్రం లచ్చిరాం దంపతులు కల్లు సేవించారు. కల్లు తాగినప్పటీ నుండి కాళ్లు చేతులు లాగడం, పిచ్చి పట్టినట్లుగా ప్రవర్తించడంతో ఉదయాన్నే 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఆ తర్వాత వాళ్లు కాళ్లనొప్పులు అని చెప్పేసి అక్కడ ట్రీట్మెంట్ చేసిన తర్వాత.. ఇది డ్రాయిల్స్ సిమ్టమ్స్ అక్కడ మీరు తాగే కల్లుకు దీనికి ఉన్నటువంటి గ్యాప్ వల్ల ఇలా జరిగిందని చెప్పారు. ప్రస్తుతం వాళ్లు డిశ్చార్జ్ అయ్యారు. అటు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బస్టాండ్‌లో ఉన్న కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన రాజు అనే వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు.



## ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రిలో అమానవీయ ఘటన..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రిలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ పట్ల వార్డ్ బాయ్ అసభ్యంగా ప్రవర్తించాడు. అత్యాచారయత్నం చేయడంతో భయాందోళనకు గురైన బాధితురాలు కేకలు వేసింది. ఆమె అరుపులతో ఆసుపత్రి సిబ్బంది, రోగుల బంధువులు అప్రమత్తమై, వార్డ్ బాయ్‌ను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వార్డ్ బాయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు నల్లకుంట పోలీసులు తెలిపారు.

## చెక్కులు పంపిణీ చేసిన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**టీపీఎన్, హైదరాబాద్ :**

బోనాల పండుగలను పురస్కరించుకుని ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 11 డివిజన్లకు సంబంధించిన వివిధ దేవాలయాలకు చెందిన 223 చెక్కులను ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో పంపిణీ చేశారు. ఆలయ అధికారులు ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్ రెడ్డికి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చెక్కులు పంపిణీ చేసిన సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో బోనాల పండుగ ఒకటి అని అలాంటి బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## తీన్మార్ గొడవ.. ఇరువర్గాలపై కేసులు నమోదు..

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇటీవల తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహించిన తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆదివారం ఉదయం మేడిపల్లిలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడికి దిగారు. మొదట తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలు కవిత ప్రేరణతో తమపై దాడికి దిగారని, ఆస్తిని ధ్వంసం చేసి తనను హత్య చేసేందుకు యత్నించారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఐపీసీ 147, 148, 452, 307, 427, 506, 353 రెడ్ విత్ 149, 109 సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ సెక్షన్ల కింద రాచకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు జాగృతి కార్యకర్త లింగమయ్య అలియాస్ అశోక్ యాదవ్ ఫిర్యాదు మేరకు తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు అయింది. మల్లన్న వ్యాఖ్యలపై ప్రశ్నించేందుకు క్యూన్యూస్ కార్యాలయం వద్దకు వెళ్లగా, మల్లన్న వర్గం తమపై దాడి చేసి కత్తులు, తుపాకులతో మహిళలను బెదిరించారని, మర్యాదకు భంగం కలిగించారని ఆరోపించారు. దీనిపై 354 బీ, 307, 506, 147, 148, ఆర్మ్స్ యాక్ట్ 25, 27 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శలు!

**టీపీఎన్, నల్లగొండ :**



రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ముగింపు పలకాలంటే బీజేపీనే అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ రామ్‌చందర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లాలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నల్లగొండ జిల్లా నా జన్మభూమి కావడంతో రాష్ట్ర అధ్యక్షుడిగా నా తొలి పర్యటన ఇక్కడే ప్రారంభిస్తున్నాను. నల్లగొండ ఉద్యమాల గడ్డ, త్యాగాల గడ్డ. శ్రీనివాస్, మైసయ్య గౌడ్ వంటి ఏబీవీపీ కార్యకర్తలు జాతీయవాదం కోసం ప్రాణత్యాగం చేశారు. ఈ జిల్లా రాజకీయ చైతన్యంతో అనేక ప్రజా ఉద్యమాలకు నాంది పలికింది. నల్లగొండ జిల్లా ఒక కుటుంబ పాలనలో ఉంది, ఒకే కుటుంబానికి చెందిన సోదరులు ఈ జిల్లాను నడుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ కుటుంబం చేతిలో బానిసగా ఉంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పార్టీకి బానిసగా ఉన్నారు. నల్లగొండలో కుటుంబ పాలనకు ముగింపు పలకాలంటే బిజెపి అధికారంలోకి రావాలి.

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ చేస్తే పేదలకు ప్రయోజనం చేకూరదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా జారీ చేయలేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తమ కార్యకర్తలకే రేషన్ కార్డులు ఇస్తోందని విమర్శించారు. అసలైన అర్హులకు రేషర్ కార్డులు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తే, బీజేపీ ప్రజల తరఫున ఉద్యమిస్తుందని హెచ్చరించారు..

"కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 హామీలతో పాటు అనేక వాగ్దానాలు చేసింది, కానీ రైతులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు భృతి, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం జరగలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకుంది, ఇప్పుడు కాంగ్రెస్ మిగిలినది దోచుకుంటోంది. రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీకి వెళ్తున్నప్పటికీ, రాహుల్ గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. రాహుల్‌కు కూడా రేవంత్‌పై నమ్మకం పోయింది, అందుకే కేంద్రంపై నిందలు వేస్తూ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నారు" అని చెప్పారు.

"తెలంగాణ అభివృద్ధి కోసం బిజెపి అధికారంలోకి రావాలి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటైతే నిరుద్యోగులు, రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయి. తెలంగాణలో బీజేపీ క్రమంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం 7 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు, 3 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో బీజేపీ ఓటు శాతం అత్యధికంగా పెరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుంది" అన్నారు.

"కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఉచిత రేషన్, శ్మశానవాటికలు, గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తోంది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల అసమర్థత వల్ల నల్లగొండలో డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు కదలలేకపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కంటే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసింది, అయినా రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌కు ఆస్కారం కల్పించింది" అని చెప్పారు

"బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై బీజేపీ అసెంబ్లీలో భేషరతుగా మద్దతు తెలిపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జాబితాలో 10 శాతం ముస్లిం మైనారిటీలను కలిపి రిజర్వేషన్లు ఇవ్వాలని చూస్తోంది, ఇది ఓటుబ్యాంకు రాజకీయమని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిజంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు శాస్త్రీయంగా అమలు చేస్తే బీజేపీ స్వాగతిస్తుంది, కానీ మతం ఆధారంగా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తామని, ఈ అంశంపై పోరాడుతామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, దీనిపై బీజేపీ ప్రజాపోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు, కాంగ్రెస్ అబద్ధాలను నమ్మడం లేదని, బీజేపీ ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అవినీతి పార్టీలను ఓడించి, నరేంద్ర మోదీ నాయకత్వంలో అవినీతిరహిత పాలన అందించాలని, రాబోయే రోజుల్లో బీజేపీ పోరాటాల బాటలో సాగుతుందన్నారు.



# ఉప్పల్ ఆర్‌ఓబీ సమస్యపై కాంగ్రెస్ నిర్లక్ష్యం :గంగాడి కృష్ణారెడ్డి

**టీపీఎన్, హైదరాబాద్ :**

దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఉప్పల్ ఆర్‌ఓబీ సమస్య గుర్తుకు రాలేదా..? లేక కనిపించలేదా..? అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులతో ఉప్పల్ రైల్వే స్టేషన్, ప్రయాణికుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన విషయాలను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి, ఉప్పల్ రైల్వే స్టేషన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఉప్పల్ ఆర్‌ఓబీ నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉన్నారని, ఈ దిశగా అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

.కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనుల కోసం గడువు ఉన్నప్పటికీ, వారం రోజుల్లోపు పనులు పూర్తి చేసే బాధ్యత రైల్వే అధికారులు తీసుకున్నారని గంగాడి తెలిపారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి సుమారు 70 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. పనులు మందకొడిగా సాగుతుండటంపై బండి సంజయ్ కుమార్ ఇటీవల రైల్వే అధికారులపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసి, జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారని, గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఓబీ నిర్మాణంపై అవగాహన లేకుండా మాట్లాడటం, కేంద్రమంత్రి బండి సంజయ్‌పై అనవసర విమర్శలు చేయడాన్ని గంగాడి తీవ్రంగా మండిపడ్డారు. దశాబ్దాలపాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ రైల్వే సమస్యలు, ప్రయాణికుల కష్టాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, కరీంనగర్ ఎంపీగా పొన్నం ప్రభాకర్ ఉన్న సమయంలో ఉప్పల్ ఆర్‌ఓబి సమస్య గురించి ఏమీ చేయలేదని ప్రశ్నించారు. నిరసనలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైల్వే అభివృద్ధి, ఆధునికీకరణ కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు ఆర్‌ఓబి నిర్మాణాలను చేపట్టిందని గంగాడి తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలో ప్రయాణికుల కష్టాలు, ప్రజల బాధలను తొలగించే లక్ష్యంతో నిర్మాణ పనులు ప్రారంభించారని, ప్రస్తుతం ఆర్‌ఓబి నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందని, గడువులోపు పూర్తయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్, జిల్లా నాయకులు బండారి సుధాకర్, తుమ్మ శోభన్ బాబు, భూపతి ప్రవీణ్, జెట్టి సారంగపాణి, మోకెడే ప్రసాద్, చిట్టి సుందరయ్య, తూర్పటి భాస్కర్, పోతిరెడ్డి శంకర్, పసునూటి రానా ప్రతాప్, దండబోయిన శ్రీనివాస్, ఎగ్గోజు శ్రీనివాస్, అకినపెల్లి రవీంద్ర, సముద్రాల మొగిలి, తోట రాంప్రసాద్, శనిగరపు సంపత్, చేరాల రాంబాబు, చీర్స్ లచ్చన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# మహా ముత్తారంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు!





**టీపీఎన్; మహాముత్తారం :**

మంథని నియోజకవర్గం మహాముత్తారంలో రూ.1.20 కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని, అలాగే 73.50 లక్షలతో నిర్మించిన సహకార గోదాము, కార్యాలయ నూతన భవనాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో రూపొందిన ఈ భవనాలు మండల పరిపాలనకు, వ్యవసాయ సహకార సేవలకి ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని మంత్రి తెలిపారు. అంతకు ముందు అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో మంత్రివర్యులు పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలకు టైలరింగ్ లో మెలకువలు నేర్పేందుకు అనుభవజ్ఞులతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ శ్రీనివాస రావు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, పిఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, సిఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో వైద్యురాలు మృతి.. హత్య అంటూ బంధువుల ఆందోళన..!

**టీపీఎన్, కృష్ణకుమార్, స్పెషల్ డెస్క్ :**





పరస్త్రీ వ్యామోహం కారణంగా సంతోషకరమైన కాపురాల్లో చిచ్చు పెట్టే ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పెళ్లి సమయంలో చేసిన ప్రమాణాలను కొందరు నీరుగారుస్తూ, జీవితాంతం కలిసి ఉండాల్సిన దంపతులు విడిపోతున్నారు. కొందరు హత్యలకు కూడా వెనుకాడటం లేదు, మరికొందరు నిరాశతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వరంగల్‌లో ఇలాంటి ఒక దారుణ ఘటన చోటుచేసుకుంది. వరంగల్‌లోని హసన్‌పర్తిలో ప్రత్యూష అనే వైద్యురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ప్రత్యూష కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె భర్త సృజన్‌ను హసన్‌పర్తి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రత్యూష తల్లిదండ్రుల వివరణ ప్రకారం, సృజన్ వరంగల్ మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యుడిగా, ప్రత్యూష మరో హాస్పిటల్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ వైద్య వృత్తిలో ఉంటూ పెళ్లి చేసుకున్నారు మ, కొంతకాలం సంతోషంగా గడిపారు. వీరికి పిల్లలు కూడా ఉన్నారు.

అయితే, సృజన్ ఒక ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ మోజులో పడి తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఈ యువతితో అతనికి ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం క్రమంగా సన్నిహితంగా మారి, సృజన్ భార్యాపిల్లలను పట్టించుకోకుండా ఆ యువతితో సినిమాలు, షికార్లు చేస్తూ విచ్చలవిడిగా వ్యవహరించాడు. ఈ ఇన్‌ఫ్లూయెన్సర్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 2 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు, ఆమె వీడియోలకు మిలియన్లలో వీక్షణలు ఉన్నాయి. ఇటీవల శ్రీలీల 'వైరల్ వయ్యారి నేను' పాటకు ఈ యువతి డ్యాన్స్ రీల్ కూడా అప్‌లోడ్ చేసింది.

సృజన్, ప్రత్యూషను విడాకులతో బెదిరించాడు. విషయం పెద్దదైతే ఆ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను పెళ్లి చేసుకుంటానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో ప్రత్యూష మానసికంగా కుంగిపోయింది. భర్త మరో యువతి మోజులో పడి తనను, పిల్లలను నిర్లక్ష్యం చేయడంతో ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురై, ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రత్యూష తండ్రి మీడియా ఎదుట వాపోతూ, సృజన్ ఇలాంటి చర్యలకు పాల్పడినా అతని తల్లిదండ్రులు పట్టించుకోలేదని ఆరోపించారు. తన కూతురి మరణానికి కారణమైన సృజన్, అతని తల్లిదండ్రులు, ఆ ఇన్‌ఫ్లూయెన్సర్ యువతిని పోలీసులు కఠినంగా శిక్షించి, ప్రత్యూషకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



# మల్లారెడ్డి కాలేజ్ విద్యార్థి ఆత్మహత్య!

**టీపీఎన్, మేడ్చల్ :**

కుత్బుల్లాపూర్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లారెడ్డి మెయిన్ క్యాంపస్‌లో డేటా సైన్స్ సెకండియర్ చదువుతున్న రమాకాంత్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. బహదూర్ పల్లిలో తన వసతి గృహంలో సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రాథమిక దర్యాప్తులో జయశంకర్ భూపాలపల్లి కాటార గ్రామానికి చెందిన రమాకాంత్ (20 ) మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. బహుదూర్ పల్లి ఇందిరమ్మ కాలనీలో ఉంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లిదండ్రులు తిరుపతి, లావణ్యగా తెలుస్తుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# కుత్బుల్లాపూర్,గాజులరామారం జంట సర్కిల్లో ప్రజావాణిలో ఫిర్యాదులు

**టీపీఎన్, మేడ్చల్:**

కుత్బుల్లాపూర్ ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివరాల్లోకి వెళ్తే కుత్బుల్లాపూర్ మరియు గాజులరామారం జంట సర్కిల్లో ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 14 సమస్యలపై ఫిర్యాదులు, గాజుల రామారం సర్కిల్ పరిధిలో 02 ఫిర్యాదులు.. మొత్తం 16 ఫిర్యాదులు అందినట్లు జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. అత్యధికంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ లో అక్రమ నిర్మాణాల పైన 9 ఫిర్యాదులు రావడం పై టౌన్ ప్లానింగ్ వ్యవస్థ ఎంత గాడి తప్పిందో ఒక చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ప్రేమపై కోర్సు.. అవును ఉండాల్సిందే..!



ఇంజనీర్, డాక్టర్ లేదా టీచర్ కావడానికీ కోర్సులు ఉంటాయి. మరి ప్రేమించడానికేంటి? ఇది వినడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ వాస్తవానికి చాలా అవసరం. చదువు మనకు ఉద్యోగానికై సిద్ధం చేస్తే, ప్రేమపై కోర్సు మన జీవితానికి సిద్ధం చేస్తుంది. దీన్ని గుర్తించిన ఢిల్లీ యూనివర్సిటీ, విద్యార్థుల కోసం ప్రేమపై ప్రత్యేక సిలబస్‌తో కోర్సు ప్రవేశపెట్టింది. నేటి పరిస్థితిలో, ప్రేమపై గందరగోళంతో జీవిస్తున్న యువతకు ఇది అత్యంత అవసరం.

**ప్రేమ – శాశ్వతమైన శక్తి**

ప్రేమ అనేది సదాకాలికమైన విషయం. ప్రతి ఒక్కరూ దీనిని అనుభవిస్తారు - స్నేహం, కుటుంబం లేదా రొమాన్స్ రూపంలో. ప్రేమ వల్లే బలమైన బంధాలు, దీర్ఘకాలిక పెళ్లిళ్లు ఏర్పడతాయి. ప్రేమ జీవితాన్ని మారుస్తుంది. కానీ దీని గురించి సరిగ్గా అర్థం చేసుకోకపోతే, బాధకీ, నష్టానికీ కారణమవుతుంది. నేటి యువత ప్రేమ అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. భ్రమలే ఎక్కువ, నిజమైన ప్రేమ అర్థం కాకపోవడం వల్ల అస్థిరత, భావోద్వేగ సమస్యలు తలెత్తుతున్నాయి.

**జెన్ Z – కొత్త ప్రేమ పదజాలం**

నేటి ప్రేమకి జెన్ Z తనదైన పదజాలాన్ని కల్పించింది: సిట్యుయేషన్‌షిప్, ఘోస్టింగ్, బెంచింగ్, బ్రెడ్‌క్రంబింగ్ లాంటి పదాలు ఇవాళ్టి ప్రేమలోని భావోద్వేగ రాహిత్యాన్ని సూచిస్తున్నాయి. ప్రేమను శారీరక లేదా ఆర్థిక మార్పిడి వరకు పరిమితం చేస్తున్నారు. భావోద్వేగం, మానసిక అనుబంధం తక్కువైపోతుండటమే యువత ఈ ప్రేమలో విఫలమవడానికీ, బాధపడటానికీ ప్రధాన కారణం.

**ప్రేమ – ఒక శక్తివంతమైన ప్రేరణ**

నిజమైన ప్రేమ ఒక వ్యక్తిని ప్రేరేపించే శక్తిగా మారుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు పోలీస్ ఆఫీసర్ గౌరవాన్ని చూసి ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నాడు. కోచింగ్ సమయంలో కలిసిన యువతితో ఏర్పడ్డ ప్రేమానుభంధం అతనికి భావోద్వేగ మద్దతుగా మారింది. తన ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకొని కష్టపడి విజయాన్ని సాధించి, చివరికి ఆమెను పెళ్లిచేసుకున్నాడు – ఈ కథ 12th ఫెయిల్ చిత్రంగా ప్రేరణనిస్తుంది. మరో వ్యక్తి భార్య జ్ఞాపకార్థంగా కొండను కోసి రోడ్డు వేశాడు. ఇవన్నీ ప్రేమ ఎంతటి శక్తివంతమైన ప్రేరణగా మారుతుందో చూపుతున్నాయి. హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం, ప్రేమతో కూడిన బంధాలు ఉన్నవారు ఎక్కువ ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తారు. కానీ యువత ఈ ప్రేమ శక్తిని కొంతకాలం నెమ్మదిగా నాశనం చేసుకుంటూ తాత్కాలిక అవసరాలకు వాడుతున్నారు.

**అపరిపక్వ ప్రేమ గోతులు**

కళాశాల విద్యార్థులు తక్కువలోపే ప్రలోభాలకు లోనై, పాటలు, బహుమతులతో మొదలై, అవసరాలు తీరిన తర్వాత మోసం చేసే ప్రేమలో పడతారు. దీన్ని లవ్ బాంబింగ్ అంటారు. ఈ తతంగం మనోభంగానికి దారితీస్తుంది. మరో ప్రమాదకర మాయాజాలం క్యాట్‌ఫిషింగ్ – నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇతరులను మోసం చేయడం. 40 సంవత్సరాలపైబడినవారూ దీనికి గురవుతున్నారు. ఇంకా గ్యాస్‌లైటింగ్ అనే మానసిక నియంత్రణ పద్ధతిలో, ఒక వ్యక్తి మరోవారిని భావోద్వేగంగా ఒత్తిడికి గురిచేస్తూ వారిని విడివిడిగా చేస్తారు, అవమానిస్తారు. ఇవన్నీ తెలియకపోవడం వల్లే జీవితాలు నాశనమవుతున్నాయి.

మరి నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

ప్రేమ అనే భావనను మనోవైద్యులు సంవత్సరాలుగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మనిషి ప్రేమలో పడటం వెనుక కారణం ఏంటి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి? లైకింగ్ థియరీ, కలర్ వీల్ థియరీ, అటాచ్‌మెంట్ థియరీ, ట్రయాంగిల్ థియరీ వంటి సిద్ధాంతాలు ప్రేమను వివరిస్తాయి. కానీ ఇవాళ్టి యువత వీటిలో ఏదీ తెలుసుకోలేదు. అందుకే ప్రేమలో పదే పదే తప్పులు చేస్తున్నారు.

**నేటి పరిస్థితుల్లో అవగాహన అవసరం**

డేటింగ్ యాప్స్, డిజిటల్ కమ్యూనికేషన్ పెరిగిన ఈ రోజుల్లో సంబంధాలు మరింత క్లిష్టమయ్యాయి. ఆన్లైన్ స్టాకింగ్, భావోద్వేగ నొక్కులు, తేలికపాటి విడిపోనలు – ఇవన్నీ యువతను వేధిస్తున్నాయి. కానీ ఇలాంటి విషయాలపై మాట్లాడే వేదికలు – ఇంట్లోనూ, కళాశాలలలోనూ – లేవు. దారి తప్పిన నిర్ణయాలు, భావోద్వేగ నష్టాలు – ఇవన్నీ మార్గదర్శనం లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. కోర్ట్ అనే సినిమాలో చూపించినట్లుగా, చట్టాలు చేయడం సరిపోదు – అవి నేర్పించాలి. అదే ప్రేమ విషయంలోనూ వర్తిస్తుంది. ప్రేమ పట్ల హెచ్చరికలు ఇవ్వడం కంటే ప్రేమను ఎలా అర్థం చేసుకోవాలి, పెంపొందించుకోవాలి, విఫలమైన ప్రేమతో ఎలా నెగ్గుకోవాలి, స్వార్థపూరిత సంబంధాలను ఎలా గుర్తించాలో నేర్పాలి.

**ప్రేమను జీవన నైపుణ్యాలుగా నేర్పాలి**

మన పిల్లలకు నడవడం, మాట్లాడటం, తినడం, ఇతరులతో వ్యవహరించడం నేర్పిస్తాం. అలానే ప్రేమించడం నేర్పించకూడదా? ప్రేమపై సరైన అవగాహన ఉండడం వల్ల యువత భావోద్వేగ విపత్తుల నుంచి తప్పించుకోగలుగుతారు. ప్రేమ శక్తిని సానుకూలంగా ఉపయోగించుకొని విజయవంతమైన జీవితం నిర్మించగలుగుతారు. ప్రేమపై ఒక సదుపాయమైన కోర్సు ద్వారా మనం భావోద్వేగ పరిపక్వత గల, బాధ్యతాయుతమైన తరం తయారు చేయగలుగుతాం.



బీ కృష్ణ, సీనియర్ సైకాలజిస్ట్
99854 28261

## ఓ సినిమా క్లాస్ రూమ్‌నే మార్చేసింది..!

# ఆ రాష్ట్రంలో ఇక బ్యాక్ బెంచీలు లేవు..!!





అనగనగా ఓ సినిమా..ఆ సినిమా స్ఫూర్తితో కేరళ రాష్ట్రంలో క్లాస్ రూం స్టైల్ మారిపోయింది. కొల్లం జిల్లాలోని ఆర్.వి.వి సెకండరీ హయ్యర్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్లి క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అక్కడ బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. బెంచీలన్నీ రౌండ్‌గా వేసున్నాయి. పాపినిశ్శేరిలోని స్కూల్, అదూర్‌లోని స్కూల్, తూర్పు మంగడ్‌లోని స్కూల్, పాలక్కాడ్‌లోని స్కూల్... ఈ స్కూళ్లన్నింటిలోనూ విద్యార్థులకు ఇదే ఆశ్చర్యం. కారణం... అక్కడ కూడా క్లాస్‌లలో బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. చుట్టూ వేసి ఉన్నాయి. గత నెల రోజులుగా కేరళలోని ఒక్కోబడి ఒక్కోబడి ఈ మార్పు చేసుకుంటూ వస్తోంది.


**ఈ మార్పుకు కారణం 'శనార్థి శ్రీకుట్టన్' సినిమా**

కేరళ రాష్ట్రంలో ఉన్నట్టుండి అక్కడ తరగతి గదులలో బ్యాక్ బెంచీలన్నీ రౌండ్ బెంచీలవడానికి కారణం రిలీజైనప్పుడు ఎవరూ పట్టించుకోని ఒక సినిమా. నెల క్రితం ఓటీటీలోకి వచ్చాక అందరూ దాన్నే చూస్తున్నారు. ఆ చూసే వారిలో విద్యార్థులు, టీచర్లు, పాఠశాల కరెస్పాండెంట్‌లు, తల్లిదండ్రులు ఉన్నారు... వారందరినీ ఆ సినిమా కదిలించింది. అందుకే వారందరూ క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఉండకూడదని నిశ్చయించుకున్నారు. నిజమే. క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఎందుకు? అంటూ ఆ సినిమా స్ఫూర్తితో క్లాస్ రూమ్ స్టైల్ మార్చేశారు.


సినిమా కథ...క్లుప్తంగా చెప్పాలంటే కె.ఆర్. నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కారెట్టు, తిరువనంతపురం. ఈ పల్లెటూరు స్కూల్లోని ఏడో తరగతి సి సెక్షన్‌లో జరిగే సినిమా కథే 'శనార్థి శ్రీకుట్టన్'. శ్రీకుట్టన్ అనే కుర్రవాడు ఇంట్లోని పరిస్థితుల వల్ల రోజూ స్కూల్‌కి లేట్‌గా వస్తుంటాడు. తను వచ్చేసరికి ముందు బెంచీలన్నీ ఫిల్ అవడం వల్ల తప్పని పరిస్థితుల్లో బ్యాక్‌బెంచ్‌లో కూచుంటుంటాడు. వాడికి ముగ్గురు ఫ్రెండ్స్. వీళ్లంతా అల్లరి గ్యాంగ్ అని క్లాస్‌లో ఫ్రంట్ బెంచ్‌లో కూచునేవారి అభిప్రాయం. నిజానికి ఏ క్లాస్ రూం అయినా లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ పై సహజంగా అందరికీ ఉండే అభిప్రాయం కూడా ఇదే. క్లాస్‌కు వచ్చే ఒక ఉపాధ్యాయుడైతే వీరి మీద పగపడతాడు. వీరు దేనికీ పనికి రారన్నది ఆ స్కూల్ టీచర్ల అభిప్రాయం. ఇక్కడే కథ మలుపు తిరుగుతుంది. శ్రీకుట్టన్ స్కూల్ ఎలక్షన్‌లో నిలబడాలనుకుంటాడు. వీడి మీద పోటీగా ఫ్రంట్ బెంచ్‌లో కూచునే అంబడి అనే కుర్రవాడు నిలబడతాడు. ఎవరు గెలుస్తారు అనేది కథ. క్లాసురూముల్లో వివక్ష ఎన్ని రూపాల్లో ఉంటుంది... వివక్షకు కారణమైన నిర్మాణం ఎలా ఉంటుంది... క్లాస్‌రూమ్‌లోనే వివక్ష పాటించిన విద్యార్థి బయటకు వెళ్లాక పాటించడని గ్యారంటీ ఏమిటీ... పైకి ఇదే కథ అనిపించినా దీనిని ముందు నుంచే మార్చాలి అని దర్శకుడు వినేష్ విశ్వనాథ్ చెప్పదలుచుకున్నాడు...చాలా బాగా చెప్పాడు.

**1996లో కేంద్రం చెప్పినా...**

క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల సీటింగ్ వారిలో వివక్షకు కారణం కాకూడదని, పిల్లల తెలివితేటలు... ఆర్థిక స్థితి... ప్రవర్తనను ఆధారంగా ముందు బెంచీలకు కొందరిని, వెనుక బెంచీలకు కొందరిని పరిమితం చేయకూడదని 1996లో కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. అయితే ఆ మార్పులను ఎవరూ పట్టించుకోలేదు. మన దేశంలో స్కూళ్లు మొదలైనప్పటి నుంచి 'మొద్దు'లుగా భావించే పిల్లలను వెనుక కూచోబెట్టడం టీచర్లకు అలవాటైపోయింది. వెనుక కూచుని వెనుకబడితే మళ్లీ వారిదే తప్పుగా నిలబెట్టడం కూడా ఆనవాయితీనే. విద్యార్థిగా పొందే గౌరవం వెనుక బెంచీ విద్యార్థులకు చాలామందికి ఉండదు. ఈ పరిస్థితి మారాలని ఒక వెనుకబెంచీ కుర్రాడిని హీరోగా చేసి అతనిలోని తెలివితేటలను, చురుకుదనాన్ని చూపుతూ నిరూపించాడు దర్శకుడు ఈ సినిమాలో. అందుకే అది కేరళ బడుల్లో కదలిక తెచ్చింది. ఇక దేశం మొత్తం ఇలాంటి సినిమాలో ఆలోచనలు వచ్చి



మార్పు తేవాల్సి ఉంటుంది. మార్పు మంచిదైతే అందరికీ మంచే కదా?



## నబా చిరుత మృతిపై పలు అనుమానాలు

**టీపీఎన్, కునో నేషనల్ పార్క్ :**
భారత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్ చీతా కింద నమీబియా నుంచి కునో నేషనల్ పార్కుకు తీసుకువచ్చిన ఎనిమిదేళ్ల ఆడ చిరుత తీవ్ర గాయాలతో చనిపోయింది. వేటాడే ప్రయత్నంలో తీవ్రగాయాలైన వారం తర్వాత చనిపోయిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చికిత్స పొందినప్పటికి కోలుకోలేక పోయిందని చీతా ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ఉత్తమ్ శర్మ అన్నారు. నమీబియా నుంచి తీసుకువచ్చిన చిరుతల్లో నబా ఒకటి. రెండు దశల్లో కునో నేషనల్ పార్కుకు విదేశాల నుంచి చిరుతలను తీసుకువచ్చారు. మొదటి బ్యాచ్ 2022 సెప్టెంబర్ లో రెండవ బ్యాచ్ ఫిబ్రవరి 2023లో దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చారు. వీర , నిర్వా అనే రెండు ఆడ చిరుతలు కూడా ఇటీవలే పిల్లలకు జన్మనిచ్చాయి. నభా మరణానికి ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోస్ట్‌మార్టం నివేదిక కోసం వెయిట్ చేస్తున్నారు అధికారులు.



## నవీన్ పట్నాయక్‌కు ఘన స్వాగతం పలికిన బీజేడీ

**టీపీఎన్, ,భువనేశ్వర్ :**
బిజు జనతాదళ్ (బిజెడి) పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ఒడిశా రాజధానికి తిరిగి వచ్చారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో ముంబైలో శస్త్రచికిత్స చేసుకుని ఒడిశాకు తిరిగి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది పార్టీ కార్యకర్తలు బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం , పట్నాయక్ నివాసానికి భారీగా తరలివచ్చారు. నవీన్ పట్నాయక్ ఇంటికి వెళ్లే మార్గంలో ఆయనకు దారిపొడవునా ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అయిన పట్నాయక్ జూన్ 22న ముంబైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. సోమవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఒడిశాకు తిరిగి రావడానికి ముందు ఒక వారం పాటు మందులు తీసుకున్నాడు. బిజెడి అధినేతకు స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు సహా పలువురు బిజెడి నాయకులు విమానాశ్రయంకు చేరుకున్నారు. ఒడిశాను అభివృద్ధి పథంలో నడిపించిన నవీన్ పట్నాయక్ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమను ఈ జనసమూహామే నిదర్శనంగా నిలుస్తుంది.



## వచ్చేవారం చైనా పర్యటనకు జై శంకర్

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
LAC ప్రతిష్టంభన తర్వాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్ తొలిసారి వచ్చే వారం చైనాను సందర్శించనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం ఈనెల 15న టియాంజిన్‌లో జరుగుతుంది. ఈ సమావేశానికి జై శంకర్ హాజరుకానున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ SCO రక్షణ మంత్రుల శిఖరాగ్ర సమావేశానికి చైనాను సందర్శించిన దాదాపు రెండు వారాల తర్వాత, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వచ్చే వారం షాంఘై సహకార సంస్థ (SCO) విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి చైనాలోని టియాంజిన్‌కు వెళ్లనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం జూలై 15న టియాంజిన్‌లో జరుగుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు, వార్తా సంస్థ PTI నివేదించింది ."వివిధ రంగాల్లో SCO సహకారం, అంతర్జాతీయ , ప్రాంతీయ సమస్యలపై అభిప్రాయాలను పంచుకుంటారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.



## పార్లమెంట్ వర్షా కాల సమావేశాలపై కాంగ్రెస్ కసరత్తు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహాలను రచిస్తోంది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షత కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు..పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. బీహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేపట్టడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తాయని భావిస్తున్నారు. అలాగే, పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన దౌత్యపరమైన చర్యలపై చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది, ఇది ముందుగా అనుకున్న దానికంటే ఒక వారం ఎక్కువ సమయం.కాంగ్రెస్ వ్యూహాన్ని ఖరారు చేయడానికి సోనియా గాంధీ అధ్యక్షతన ఈనెల 15న సమావేశం కానున్నారు.
ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడిపై చర్చకు ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అణు యుద్ధాన్ని నివారించడానికి భారతదేశంపాకిస్తాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరుతున్నాయి. గత నెలలో జరిగిన ఫోన్ కాల్‌లో, భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులో కూడా దానిని అంగీకరించదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్రంప్ వాదనలను ప్రభుత్వం తిరస్కరించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో 23 మంది మావోయిస్టులు లొంగుబాటు

**టీపీఎన్, సుక్మా :**
ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో 23 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. సరెండర్ అయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు , మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్ కూడా ఉన్నారు. వీరికి రూ.1.18 కోట్ల నజరానా ప్రకటించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) సాయుధ విభాగమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) యొక్క బలీయమైన బెటాలియన్ 1 నుండి ఎనిమిది మంది కఠినమైన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. లొంగిపోయిన వారిలో లోకేష్ అలియాస్ పొడియం భీమ (35) అనే డివిజనల్ కమిటీ సభ్యుడు (DVCM) కూడా ఉన్నాడు. 2007 నుండి, అతను బస్తర్ ప్రాంతంలో కనీసం తొమ్మిది దాడుల కేసుల్లో పాల్గొన్నాడు, దీనివల్ల అనేక మంది భద్రతా సిబ్బంది మరణించారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ అన్నారు. లొంగిపోయిన మరో మావోయిస్టును రమేష్ అలియాస్ కల్మ (35)గా గుర్తించారు, ఇతను మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్. ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.8 లక్షల బహుమతి ఉంది. 2024నుంచి నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం అయిన తర్వాత, 1,450 మందికి పైగా మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. వీటి వెనుక అనేక అంశాలు ఉన్నాయని చవాన్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు కూడా గిరిజనులపై జరిగిన హింసను ఇష్టపడలేదని చవాన్ అన్నారు. ప్రతి మావోయిస్టుకు లొంగిపోయిన మొత్తంగా రూ. 50,000 ఇవ్వడంతో పాటు నైపుణ్య శిక్షణ కూడా పొందుతారు.



## వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగావకాశాలు

**టీపీఎన్, బీహార్ :**
ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రజలకు వరాల జల్లు కురిపిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చే రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జననాయక్ కర్పురి ఠాకూర్ నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలకు, కోటి మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు , ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా 202025 లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.. దీనిని సాధించడానికి, ప్రైవేట్ రంగంలో, ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయి. దీని కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని.. ప్రైవేట్ రంగంలో దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తంగా 50 లక్షల మందికి పైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు..ఉపాధి కల్పించామనే చెప్పడానికి తాను గర్వంగా ఫీలవుతున్నాయని చెప్పారు. 2005 నుంచి 2020 మధ్య బీహార్‌లోని 8 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని నితీష్ కుమార్ పేర్కొన్నారు.





## తమిళనాడులో గూడ్స్ రైలులో మంటలు

**టీపీఎన్, తిరువళ్లూరు :**
తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం జరిగింది. తిరువళ్లూరులోని చెన్నైఅరక్కోణం మార్గంలో ఓ గూడ్స్‌రైలు భారీ ప్రమాదానికి గురైంది. డీజిల్ ట్యాంకరుతో వెళ్తున్న రైలుకు మంటలు అంటుకున్నాయి. మొత్తం నాలుగు వ్యాగన్లు మంటల్లో చిక్కుకున్నాయి. నల్లని దట్టమైన పొగలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. గూడ్స్ రైలులో పెద్ద ఎత్తున ఇంధనం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు చెన్నైఅరక్కోణం మార్గంలో అన్ని రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు, నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



# దలైలామా వారసుడి ఎంపికపై చైనా ఆగ్రహం ఎందుకు?

దలైలామా వారసుడి అంశాన్ని భారత దేశం , చైనా మధ్య సంబంధాలలో ఒక ముల్లులా అభివర్ణించారు చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి. దలైలామా పునర్జన్మ గురించి కొంతమంది భారతీయ నిపుణులు, విద్యావేత్తలు తప్పుడు ప్రకటనలు చేశారని అన్నారు. టిబెటన్ బౌద్ధుల ఆధ్యాత్మిక నాయకుడు దలైలామా తన 90వ పుట్టినరోజును హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలోని సుగ్లఖాంగ్ ఆలయ సముదాయంలో బౌద్ధ సమాజ ప్రజల మధ్య జరుపుకున్నారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్, అరుణాచల్ సీఎం పెమా ఖండు, సిక్కిం మంత్రి సోనమ్ లామా ఈ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. దలైలామా పుట్టినరోజు సందర్భంగా భారత ప్రభుత్వ ప్రతినిధులు అక్కడ ఉండటంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దలైలామా వారసుడి అంశం చైనా, భారతదేశం మధ్య సంబంధాలలో అడ్డంకిగా ఉందని ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయం ఆదివారం అభివర్ణించింది. 2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత విదేశాంగ మంత్రి తొలిసారిగా చైనాను సందర్శించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. తన వారసుడిని ఎన్నుకోవడంలో చైనాకు ఎటువంటి పాత్ర ఉండదని తన పుట్టినరోజు సందర్భంగా దలైలామా స్పష్టం చేశారు. మరో 30 నుంచి 40 సంవత్సరాలు జీవించాలనే కోరికను ఆయన వ్యక్తం చేశారు. ఒక గొప్ప సన్యాసి మరణించినప్పుడు, అతని ఆత్మ మరొకరిలో పునర్జన్మ పొందుతుందని టిబెటన్లు నమ్ముతారు. కానీ దలైలామా తదుపరి వారసుడిని తమ నాయకుల ఆమోదంతో మాత్రమే నిర్ణయిస్తామని చైనా చెబుతోంది.దలైలామా 1959లో చైనా పరిపాలనా టిబెట్ నుండి పారిపోయి భారతదేశంలో ఆశ్రయం పొందారు. అప్పటి నుండి, ఆయన భారతదేశంలో నివసిస్తున్నారు. చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన స్వరాన్ని వినిపిస్తున్నారు. భారతదేశంలో సుమారు 70 వేల మంది టిబెటన్ శరణార్థులు నివసిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో ఓ వ్యాపారి దారుణ హత్య




**టీపీఎన్, ఢాకా :**

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఓ హిందూ వ్యాపారవేత్తను కాంక్రీట్ స్లాబ్‌తో కొట్టి చంపారు దుండగులు. అనంతరం మృత దేహంపై నృత్యం చేస్తున్నవీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా భారీగా నిరసనలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. లాల్ చంద్ సోదరి మంజురా బేగం కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు పోలీసులు. ఇందులో 19 మంది నిందితులతో పాటు 15 నుంచి 20 మంది గుర్తుతెలియని వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. పోలీసులు ఇప్పటివరకు 5 మందిని అరెస్టు చేశారు, వీరిలో ఇద్దరు అక్రమ ఆయుధాలను కలిగి ఉన్నట్లు కూడా గుర్తించారు.

# అమెరికా, జపాన్, దక్షిణకొరియాలకు రష్యా వార్నింగ్

- **ఉత్తరకొరియా జోలికి వస్తే చూస్తూ ఊరుకోం**



ఉత్తర కొరియాను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర పరిణమాలు ఉంటాయని అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలను రష్యా హెచ్చరించింది. ఉత్తర కొరియా అణు కార్యక్రమానికి ప్రతిస్పందనగా అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా తమ త్రైపాక్షిక సైనిక విన్యాసాలను ముమ్మరం చేసిన సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం మూడు దేశాలు కొరియా ద్వీపకల్పం సమీపంలో ఉమ్మడి వైమానిక విన్యాసాలు నిర్వహించాయి. దీనిలో అణ్వాయుధాలను మోసుకెళ్లగల అమెరికన్ బాంబర్లు కూడా పాల్గొన్నాయి. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ శనివారం తూర్పు ఉత్తర కొరియా నగరమైన వోన్సాన్‌లో అమెరికా నేతృత్వంలోని భద్రతా కూటమికి వ్యతిరేకంగా తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ఎటువంటి సైనిక కూటమికి దూరంగా ఉండాలని అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లకు లావ్‌రోవ్ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌ను కలిసిన తర్వాత ఆయన ప్రకటన వెలువడింది. ఉత్తర కొరియా లేదా రష్యాకు వ్యతిరేకంగా కూటమిని నిర్మించడానికి ఉపయోగించకూడదని ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో సన్ హుయ్‌తో చర్చల తర్వాత లావ్‌రోవ్ విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఉత్తర కొరియా ఈ సైనిక విన్యాసాలను దాడికి సన్నాహకంగా భావిస్తోంది. అందుకే అది తన అణ్వాయుధాలను ఆత్మరక్షణ సాధనంగా అభివర్ణిస్తోంది. ఈ విషయంపై లావ్రోవ్ మాట్లాడుతూ ఉత్తర కొరియా అణు కార్యక్రమం దాని శాస్త్రవేత్తల కృషి ఫలితమే. వారి అణు అభివృద్ధి వెనుక గల కారణాలను మేము అర్థం చేసుకున్నామని.. గౌరవిస్తామని అన్నారు.ఈ సమావేశంలో, ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు తమ దేశం బేషరతుగా మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. రష్యాలోని కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలో ఉక్రెయిన్ చొరబాట్లను ఆపడంలో ఉత్తర కొరియా దళాల సహకారానికి లావ్రోవ్ కృతజ్ఞతలు తెలిపారు.గత సంవత్సరాల్లో ఉత్తర కొరియా , రష్యా మధ్య సైనిక , ఆర్థిక సహకారం మరింతగా పెరిగింది. ఉత్తర కొరియా రష్యాకు ఆయుధాలు , మందుగుండు సామగ్రిని అందిస్తుంది, అయితే రష్యా సైనిక సాంకేతికత, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. దీని వలన రష్యా ఉత్తర కొరియాకు అటువంటి సున్నితమైన సాంకేతికతను అందించవచ్చని, ఇది దాని అణు , క్షిపణి కార్యక్రమాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తుందని అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా ఆందోళన వ్యక్తం చేశాయి.లావ్రోవ్ పర్యటన వోన్సాన్ నగరంలో జరిగింది, అక్కడ ఉత్తర కొరియా ఇటీవల 20,000 మందికి వసతి కల్పించగల ఒక గొప్ప సముద్ర రిసార్ట్‌ను ప్రారంభించింది. రష్యన్ పర్యాటకులు ఇక్కడికి రావాలని కోరుకుంటారని నాకు ఖచ్చితంగా తెలుసు. విమాన ప్రయాణంతో సహా వారిని ఇక్కడికి తీసుకురావడానికి మేము సాధ్యమైన ప్రతి సౌకర్యాన్ని అందిస్తామని సమావేశం ప్రారంభంలో లావ్రోవ్ అన్నారు.ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ తన శిథిలావస్థలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పర్యాటకం ద్వారా పునరుద్ధరించాలనే ప్రణాళికలో వోన్సాన్‌కల్మా పర్యాటకం అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. అయితే, ఉత్తర కొరియా తన సరిహద్దులను ఎప్పుడు పూర్తిగా తెరుస్తుందో, పాశ్చాత్య పర్యాటకులను స్వాగతిస్తుందో ఇంకా స్పష్టంగా తెలియలేదు.

# శాంతియుత ప్రయోజనాల కోసం మా అణు కార్యక్రమం

**టీపీఎన్, పాకిస్తాన్ :**



భారత్ ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో అణు ఉద్రిక్తతలు దారితీశాయని.. పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలపై ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. అవన్నీ అసత్య ప్రచారమేనని కొట్టిపారేశారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి "అణు బ్లాక్‌మెయిల్" కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది.ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



## శత్రువు రక్షణ వ్యవస్థను
# నాశనం చేసే ఆయుధం

- **2030 లో భారత సైన్యంలోకి పినాకా-4**

భారతదేశ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (DRDO) తదుపరి తరం గైడెడ్ రాకెట్ వ్యవస్థ పినాకా4 ను అభివృద్ధి చేస్తోంది. దీని పరిధి 300 కిలోమీటర్లు ఉంటుంది. పినాకా 4 యొక్క పరీక్షలు 2028 లో ప్రారంభమవుతాయి. దీనిని 2030 లో భారత సైన్యంలోకి చేర్చనున్నారు. ఈ వ్యవస్థ DRDO యొక్క ప్రలే షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ క్షిపణి (SRBM) నుండి ప్రేరణ పొందిన శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోవడానికి అధునాతన లక్షణాలను కలిగి ఉంటుంది.

పినాకా4 అనేది ఒక విప్లవాత్మక అడుగు. ఇది దాని లక్ష్య పరిధిని 300 కి.మీ.లకు విస్తరిస్తుంది. ఇది వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణులకు చౌకైన , మరింత ఖచ్చితమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది. DRDO యొక్క ఆయుధ పరిశోధన అభివృద్ధి స్థాపన (ARDE) , సోలార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ పరిశ్రమ భాగస్వాముల సహకారంతో అభివృద్ధి చేయబడిన పినాకా 4, కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్‌లు , శత్రు కోటల లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులు చేస్తోంది.

**పినాకా-4 యొక్క లక్షణాలు**

పినాకా4 యొక్క 300 mm క్యాలిబర్, మునుపటి 214 mm వెర్షన్ల కంటే పెద్దది. ఇది ఎక్కువ ప్రొపెల్లెంట్ లోడ్‌ను 250 కిలోల వార్‌హెడ్‌ను మోయగల సామర్థ్యాన్ని ఇస్తుంది. దీని విధ్వంసక శక్తిని పెంచుతుంది.

**అధునాతన మార్గదర్శక వ్యవస్థ**

DRDO యొక్క రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (RCI) అభివృద్ధి చేసిన గైడెన్స్, నావిగేషన్ కంట్రోల్ (GNC) వ్యవస్థ 10 మీటర్ల కంటే తక్కువ వృత్తాకార దోష సంభావ్యత (CEP) తో ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుంది, ఇది చైనా యొక్క PHL16 , రష్యా యొక్క స్మెర్చ్ MBRL వంటి వ్యవస్థలతో పోటీ పడుతోంది.


**వాయు రక్షణను తప్పించుకునే సామర్థ్యం**

పినాకా4 యొక్క అతి ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ఇది శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలదు. ఇది 150-500 కిలోమీటర్ల పరిధి .. క్వాసీబాలిస్టిక్ పథంతో, మానియోవెలబుల్ రీఎంట్రీ వెహికల్ (MaRV), జెట్ వేన్‌ల ద్వారా థ్రస్ట్ వెక్టర్ నియంత్రణ , డెకాయ్ డిప్లాయ్‌మెంట్‌ను ఉపయోగిస్తుంది. పినాకా4 రాడార్ గుర్తింపు , అంతరాయాన్ని ఎదుర్కోవడానికి మిడ్‌కోర్స్ యుక్తి, ఫ్లాట్ ఫ్లైట్ పథం , అధునాతన ఎలక్ట్రానిక్ కౌంటర్మెజర్స్ (ECCM) కలిగి ఉంటుంది.

**ప్రాంతీయ సవాళ్లు**

పినాకా4 ను చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ (PLARF) నుండి వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేశారు, ఈ రాకెట్ ఫోర్స్ PHL16 (250-500 కి.మీ పరిధి) వంటి వ్యవస్థలను నిర్వహిస్తుంది. 300 కి.మీ వేరియంట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా, DRDO చైనా రాకెట్ ఫిరంగిదళంలోని సంఖ్యలు, శ్రేణి ప్రయోజనాన్ని ఎదుర్కోవడం లక్ష్యంగా పెట్టుకుంది.

# మార్కెట్లో కనిపించని పాజిటివ్ సెంటిమెంటు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టపోయాయి. బెంచ్‌మార్క్ సూచీలు మోస్తరుగా పతనమయ్యాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు రావడం, మార్కెట్లో బయింగ్ సెంటిమెంటు దెబ్బతినడం, అమెరికాతో వాణిజ్యం ఒప్పందంపై సందిగ్ధం కొనసాగడమే ఇందుకు కారణాలు. ఫలితాలకు ముందు ఐటీ కంపెనీల షేర్లు పతనమవ్వడం ఇందుకు మరింత ఆజ్యం పోసింది. అయితే మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు పుంజుకోవడం గమనార్హం. మొత్తంగా నిఫ్టీ 247, నిఫ్టీ 67 పాయింట్ల నష్టపోయాయి. నిఫ్టీ కీలకమైన 25000 స్థాయిలో ఊగిసలాడుతుండటం గమనార్హం.

క్రితం సెషన్లో 82,500 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ సోమవారం 82,537 వద్ద మొదలైంది. 82,010 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,537 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 247 పాయింట్ల నష్టంతో 82,253 వద్ద ముగిసింది. 25,149 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,001 వద్ద కనిష్ఠ, 25,151 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 67 పాయింట్ల నష్టంతో 25,082 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 10 పాయింట్లు పెరిగి 56,765 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 22 కంపెనీలు లాభపడగా 28 నష్టపోయాయి. ఎటర్నల్, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఓఎన్జీసీ, గ్రాసిమ్ టాప్ గెయినర్స్. జియో ఫైనాన్స్, టెక్ మహీంద్రా, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫీ ఎక్కువ నష్టపోయాయి. నేడు రియాల్టి, మీడియా, హెల్త్‌కేర్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంకు, ఎనర్జీ, మెటల్, ఆటోసూచీలు ఎగిశాయి. ఐటీ, ఫైనాన్స్, ఇన్ఫ్రా, ప్రైవేటు బ్యాంకు సూచీలు స్వల్పంగా ఎరుపెక్కాయి.

ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లు, సెల్లర్లకు సమానంగా ఉంది. 1464 లాభపడగా 1482 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 80 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 36 తాకాయి. అప్పర్ సర్క్యూటును 94, లోయర్ సర్క్యూటును 73 చేరాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి 19 పైసలు బలహీనపడి 85.99 వద్ద స్థిరపడింది. క్యూ1 ఎర్నింగ్స్‌కు ముందు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. ఓలా ఎలక్ట్రిక్ నికర నష్టాలు రూ.347 కోట్ల నుంచి రూ.428 కోట్లకు పెరిగాయి. ఆదాయం 50% నష్టంతో రూ.1644 కోట్ల నుంచి రూ.828 కోట్లకు చేరింది. రూ.4500 టార్గెట్ ధరతో అవెన్యూ సూపర్ మార్కెట్‌కు మోతీలాల్‌ఓస్వాల్ బయ్ రేటింగ్ ఇచ్చింది. గ్లెన్‌మార్క్ ఫార్మాకు రూ.2275 టార్గెట్ ధరతో హెచ్‌ఎస్‌బీసీ బయ్ రేటింగ్ కొనసాగించింది. డీఎల్ఎఫ్ నుంచి అహ్లువాలియా కాంట్రాక్టుకు రూ.2089 కోట్ల ఆర్డర్ లభించింది. సౌత్ సెంట్రల్ రైల్వే నుంచి రైల్ వికాస్ నిగమ్‌కు రూ.213 కోట్ల విలువైన లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ వచ్చింది. మూడోరోజు మధ్యాహ్నానికి స్మార్ట్ వర్క్స్ కోవర్కింగ్ ఐపీవోకు 6.33 రెట్ల స్పందన లభించింది.

మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

# బిట్‌కాయిన్ దూకుడు: తొలిసారి $121,000 స్థాయికి చేరిక



క్రిప్టో కరెన్సీ రారాజు బిట్‌కాయిన్ మరో సరికొత్త రికార్డు సృష్టించింది. తొలిసారి సోమవారం $121,000 స్థాయిని టచ్ చేసింది. ఆసియా ట్రేడింగ్ సెషన్‌లో $122,571.19 వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ సంవత్సరం ఇప్పటివరకు 29% పెరగడంతో బిట్‌కాయిన్ మార్కెట్ క్యాపిటలైజేషన్ $2.38 ట్రిలియన్లకు చేరుకుంది. మొత్తంగా క్రిప్టో మార్కెట్ విలువ $3.78 ట్రిలియన్లుగా నమోదైంది. ఈ దూకుడు వెనక కొన్ని కారణాలు ఉన్నాయి.

**క్రిప్టో వీక్ ఊతం**

బిట్‌కాయిన్ జోరులో అమెరికాలో జరుగుతున్న "క్రిప్టో వీక్" కీలక పాత్ర పోషిస్తోంది. యూఎస్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఈ వారం డిజిటల్ ఆస్తుల కోసం నియంత్రణ చట్టం తీసుకొచ్చే బిల్లులను చర్చిస్తోంది. స్టేబుల్‌కాయిన్లు, డిజిటల్ ఆస్తుల నియంత్రణ, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీపై నిషేధం వంటి బిల్లులు ఈ చర్చల్లో భాగంగా ఉన్నాయి. ఈ చట్టాలు క్రిప్టో పరిశ్రమకు స్పష్టతను తీసుకొస్తాయని, సంస్థాగత పెట్టుబడులను పెంచుతాయని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ఇదే బిట్‌కాయిన్ ధరలను ఉప్పెనలా నడిపించింది.

**ఈటీఎఫ్‌లతో పెట్టుబడులు**

బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్ (ETFs)లో భారీ పెట్టుబడులు ఈ ర్యాలీకి ఊతమిచ్చాయి. జూలై 11న క్రిప్టో ఫండ్స్‌లో $1.23 బిలియన్ ఇన్‌ఫ్లో నమోదయ్యాయి. అందులో బిట్‌కాయిన్ ETFs $1.03 బిలియన్లను ఆకర్షించాయి. ఈ సంస్థాగత డిమాండ్ ధరలను మరింత పెంచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనను "క్రిప్టో అధ్యక్షుడు"గా పేర్కొని, పరిశ్రమకు అనుకూలమైన సంస్కరణలను ప్రోత్సహించడమూ ఓ కారణమే.

**ఇతర ఆల్ట్ కాయిన్లపై ప్రభావం**

బిట్‌కాయిన్ ర్యాలీ ఇతర క్రిప్టోకరెన్సీల పైనా ప్రభావంచూపింది. ఈథర్ (Ethereum) ఐదు నెలల గరిష్ఠ స్థాయి $3,048.23కు చేరింది. XRP, సోలానా 3% పెరిగాయి. కొంతమంది విశ్లేషకులు ఈ ర్యాలీని ఒక సోలో ఈవెంట్‌గా భావిస్తున్నప్పటికీ ద్రవ్య విస్తరణ, మానిటరీ ఈజింగ్ వంటి ఆర్థిక కారణాలు బిట్‌కాయిన్‌కు అనుకూలమైన నేపథ్యాన్ని సృష్టించాయి. కొందరు బిట్‌కాయిన్ ధర $125,000ను తాకవచ్చని అంచనా వేస్తున్నారు.

# అమెరికాకు భారత ఎగుమతుల్లో పోటీతత్వం పెరుగుతుంది : నీతి ఆయోగ్




చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై ట్రంప్ సర్కారు భారీ సుంకాలు విధించడంతో అమెరికాకు భారత ఎగుమతుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుందని నీతి ఆయోగ్ వెల్లడించింది. ఈ సందర్భంగా 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' మూడో సంచికను సోమవారం విడుదల చేసింది. ఈ నివేదికలో అమెరికాకు భారత ఎగుమతులకు సంబంధించిన సరికొత్త వివరాలు పొందుపరిచారు.

హెచ్ఎస్2 లెవల్‌లో ఎగుమతి అవకాశాలు

- 'హెచ్ఎస్2' లెవల్‌లోని 99 కేటగిరీల ఉత్పత్తుల ఎగుమతిలో భారత్ ఇతర దేశాలను అధిగమిస్తుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది.
- టాప్ 30 కేటగిరీలలో 22 కేటగిరీల ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ ఆధిపత్యం సాధిస్తుందని, ఈ ఉత్పత్తుల మార్కెట్ విలువ 2,285.2 బిలియన్ డాలర్లుగా ఉందని తెలిపింది.
- చైనా, కెనడా, మెక్సికోలు ఇప్పటివరకు ఈ విభాగాల్లో అతిపెద్ద ఎగుమతిదార్లుగా ఉన్నప్పటికీ, భారత్ వీటిని దాటేస్తుందని నీతి ఆయోగ్ పేర్కొంది.
- అమెరికా చైనాపై 30 శాతం, కెనడాపై 35 శాతం, మెక్సికోపై 25 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోందని, ఈ సుంకాల భారం భారత ఎగుమతులకు కలిసొస్తుందని వివరించింది.
- ఖనిజాలు, ఇంధనాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఫర్నీచర్, సీఫుడ్‌లతో కూడిన 1,265 బిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్‌పై భారత్ దృష్టి సారించిందని తెలిపింది.

**హెచ్ఎస్-2 లెవల్‌లో ఆధిపత్యం**

- 'హెచ్ఎస్2' లెవల్‌లోని టాప్ 30 ఉత్పత్తి కేటగిరీలలో 6 ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది.
- ఈ 6 కేటగిరీల ఉత్పత్తులలో అమెరికాకు జరిగే ఎగుమతుల్లో భారత్ 32.8 శాతం వాటా కలిగి ఉంది, అమెరికా దిగుమతుల్లో 26 శాతం వాటా భారత్‌దే.
- ఈ కేటగిరీల మార్కెట్ విలువ సుమారు 26.5 బిలియన్ డాలర్లుగా ఉందని నివేదికలో పేర్కొన్నారు.

ఈ ఉత్పత్తులపై అమెరికా 1 నుంచి 3 శాతం అదనపు దిగుమతి సుంకాలు విధిస్తోంది, దీనిపై చర్చల ద్వారా కొంతమేర తగ్గించుకోవచ్చని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

హెచ్ఎస్4 లెవల్‌లో ఎగుమతి ఆధిపత్యం

- అమెరికాకు భారత్ చేస్తున్న ఎగుమతుల్లో 78 ఉత్పత్తులు 52 శాతం వాటా కలిగి ఉన్నాయి, వీటిలో రాబోయే రోజుల్లో భారత్ పైచేయి సాధించవచ్చని నీతి ఆయోగ్ అంచనా వేసింది.
- 'హెచ్ఎస్4' లెవల్‌లోని టాప్ 100 ఉత్పత్తులలో 17 ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది.
- ఈ 17 ఉత్పత్తులపై అమెరికా విధించే దిగుమతి సుంకాలు మారకపోవడంతో ఎగుమతులు నిరాటంకంగా కొనసాగుతున్నాయని, ఈ ఉత్పత్తులు భారత ఎగుమతుల్లో 28 శాతం వాటా కలిగి ఉన్నాయని తెలిపింది.

**హెచ్ఎస్ కోడింగ్ వివరణ**

- అమెరికా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులు, ఉత్పత్తులకు 'హెచ్ఎస్' కోడింగ్ (HS code) జారీ చేస్తుంది. ఈ కోడ్‌లో 10 అంకెలు ఉంటాయి, ఇవి వస్తువు, కేటగిరీ, సుంకం, నియంత్రణ నిబంధనల సమాచారాన్ని సూచిస్తాయి.
- నివేదికలో ప్రస్తావించిన హెచ్ఎస్2, హెచ్ఎస్4 కేటగిరీలు ఈ కోడింగ్ విధానంలో భాగమే.

**అమెరికాతో వాణిజ్య చర్చలు**

- ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై అమెరికాతో తదుపరి దశ చర్చల కోసం భారత వాణిజ్య శాఖ బృందం వాషింగ్టన్‌కు చేరుకుంది. ఈ చర్చలు సోమవారం ప్రారంభమవుతాయి.
- వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ బుధవారంకల్లా వాషింగ్టన్‌కు చేరుకుని చర్చల్లో పాల్గొంటారు. ఈ చర్చలు గురువారం ముగియనున్నాయి.
- ఈ ఏడాది సెప్టెంబరుఅక్టోబరు నాటికి చర్చలను ముగించి, కనీసం మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్, అమెరికా లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**ఎగుమతి, దిగుమతి గణాంకాలు**

- ఈ ఏడాది ఏప్రిల్‌మే మధ్యకాలంలో అమెరికాకు భారత ఎగుమతులు 21.78 శాతం పెరిగి 17.25 బిలియన్ డాలర్లకు చేరాయి.
- అదే సమయంలో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు 25.8 శాతం పెరిగి 8.87 బిలియన్ డాలర్లకు చేరాయి.

# నగదు నిల్వలు తగ్గించిన మ్యూచువల్ ఫండ్ కంపెనీలు

మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు పంథా మార్చాయి. జూన్ నెలలో తమ నగదు నిల్వలను తగ్గించుకున్నాయి. మొత్తం నగదు హోల్డింగ్స్‌ను రూ.13,000 కోట్లు తగ్గించి రూ. 2.04 లక్షల కోట్లకు చేర్చాయి. దీని ఫలితంగా క్యాష్‌టుఅసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (AUM) నిష్పత్తి 5.08%కి తగ్గింది. ప్రముఖ ఫండ్ హౌస్‌లైన PPFAS మ్యూచువల్ ఫండ్, క్వాంట్ మ్యూచువల్ ఫండ్ సంస్థలూ తమ నగదు కేటాయింపులను తగ్గించాయి. SBI మ్యూచువల్ ఫండ్ అత్యధిక నగదు హోల్డింగ్‌ను కొనసాగించింది. అయితే కొన్ని చిన్న ఫండ్ హౌస్‌లు తమ పరిమిత AUM కారణంగా ఎక్కువ నగదు నిష్పత్తిని కొనసాగించాయి.

**మ్యూచువల్ ఫండ్స్ నగదు తగ్గింపు**

జూన్ నెలలో మ్యూచువల్ ఫండ్స్ తమ నగదు హోల్డింగ్స్‌ను రూ. 13,000 కోట్లు తగ్గించాయి. ఫలితంగా మొత్తం నగదు రూ. 2.04 లక్షల కోట్లకు చేరింది. మే నెలలో నగదు హోల్డింగ్స్ రూ. 2.17 లక్షల కోట్లుగా ఉండగా నగదు కేటాయింపు AUMలో 5.66%గా ఉంది. జూన్‌లో ఇది 5.08%కి తగ్గింది. మొత్తం ఈక్విటీ AUM జూన్‌లో రూ. 40.19 లక్షల కోట్లుగా నమోదైంది.

**ప్రముఖ ఫండ్ హౌస్‌ల నగదు హోల్డింగ్స్**

అతిపెద్ద ఫండ్ హౌస్ ఎస్బీఐ వద్ద జూన్‌లో రూ.34,654 కోట్ల నగదు ఉంది. మొత్తం AUMలో ఇది 4.68% కావడం గమనార్హం. ICICI ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ వద్ద రూ. 28,196 కోట్లు, HDFC మ్యూచువల్ ఫండ్ వద్ద రూ.27,012 కోట్ల నగదు, PPFAS మ్యూచువల్ ఫండ్ దగ్గర రూ. 22,778 కోట్ల నగదు ఉన్నాయి. మేలో PPFAS నగదు రేషియో 21.62 శాతం ఉండగా ఇప్పుడు 19.65%కి తగ్గింది. మోతీలాల్ ఓస్వాల్, నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ వద్ద వరుసగా రూ. 8,994 కోట్లు, రూ. 7,960 కోట్లు ఉన్నాయి.

**చిన్న ఫండ్ హౌస్‌లు**

సుమారు 21 చిన్న చిన్న ఫండ్ హౌస్‌లు వద్ద రూ.1,000 కోట్ల కంటే తక్కువ నగదు ఉంది. వీటిలో 10 ఫండ్ హౌస్‌లు రూ. 100 కోట్ల కంటే తక్కువ నగదును కలిగి ఉన్నాయి. ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ వద్ద రూ. 90.09 కోట్ల నగదు, సామ్‌కో మ్యూచువల్ ఫండ్ వద్ద రూ. 62.14 కోట్లు, యూనిఫై మ్యూచువల్ ఫండ్ (న్యూ ఎంట్రీ) వద్ద రూ. 29.74 కోట్లు ఉన్నాయి.

**మార్కెట్ సెంటిమెంట్‌కు సూచన**

నగదు నిల్వల తగ్గింపు మార్కెట్‌లో సానుకూల సెంటిమెంట్‌ను సూచిస్తోంది. ఎందుకంటే ఫండ్ మేనేజర్లు నగదును ఈక్విటీలు లేదా ఇతర పెట్టుబడి అవకాశాలలో ఉపయోగించడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. జూన్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో రూ. 23,587 కోట్ల నికర ఇన్‌ఫ్లో నమోదయింది. ఇది మే నెల కంటే 24% ఎక్కువ. ఫ్లెక్సీక్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్కీముల్లోకి డబ్బులు వెళ్లాయి.





# సాహసాలే ఆమెకు నేస్తాలు..

మనసులో ఉండే భయాన్ని తరిమికొడితే ఎలాంటి సాహసమైనా చేయొచ్చు అంటుంది అనుజా వైద్య. గుజరాత్‌కు చెందిన అనుజ అడ్వెంచర్ గేమ్స్ లో తనదైన ప్రతిభ చూపిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన శిఖరాల్ని అనుజ చాలా ఈజీగా అధిరోహించింది. ఇప్పుడు వాటర్ స్పోర్ట్స్ లోనూ తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటుంది. రీసెంట్ గా థాయ్ ల్యాండ్ లో జరిగిన ఏషియన్ వాటర్ స్కీయింగ్ అండ్ వేక్‌బోర్డింగ్ ఛాంపియన్‌షిప్స్ లో పోటీపడిన ఆమె.. ఇంటర్నేషనల్ వాటర్ స్కీయింగ్ పోటీల్లో పాల్గొన్న ఫస్ట్ ఇండియన్ గా రికార్డ్ క్రియేట్ చేసింది. మరి ఈ యంగ్ అడ్వెంచరర్ గురించి డీటైల్డ్ గా తెలుసుకుందాం. అనుజా వైద్య.. గుజరాత్ లోని సూరత్‌లో పుట్టి పెరిగింది. ఆమె అక్క అదితి. వీళ్లిద్దరికీ అడ్వెంచర్ గేమ్స్ అంటే చిన్నతనం నుంచే ప్రాణం. తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్న వయసులోనే ట్రెక్కింగ్, స్విమ్మింగ్ పై పట్టు సాధించిన వీరు.. ట్రక్కింగ్ పైనా దృష్టి పెట్టారు. 2019లో ఈ అక్కచెల్లెళ్లిద్దరూ కలిసి మొదటి ప్రయత్నంలోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. దీంతో ఎవరెస్ట్ సిస్టర్స్ గా అప్పట్లో వీరి పేరు మార్మోగింది. అనుజ ఇన్‌స్టా బయో కూడా ఇదే విషయం చెబుతోంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం ఎవరెస్ట్‌ను అధిరోహించిన రెండో అక్కచెల్లెళ్లుగా రికార్డు మాదే! అని రాసుకుందామె. ఇలా తన అక్కతోనే కాదు.. పర్సనల్ గా కూడా పర్వతారోహణలో మరిన్ని రికార్డులు తన అకౌంట్ లో వేసుకుంది. ఈ క్రమంలోనే ఏడు ఖండాల్లో ఏడు ఎత్తైన శిఖరాల్ని అధిరోహించి సెవెన్ సమిట్స్ ఛాలెంజ్ ను అనుజ కంప్లీట్ చేసింది. ఆమె పెరిగి పెద్దయ్యే కొద్దీ వాటర్ స్పోర్ట్స్ పైనా ఇంట్రెస్ట్ చూపింది అనుజ. దాదాపు ఏడేళ్లుగా వాటర్ స్కీయింగ్ లో ట్రైనింగ్ తీసుకుంటోన్న ఆమె.. సూరత్ లోని తపీ నదిలో తన తండ్రితో కలిసి ప్రాక్టీస్ చేయడం స్టార్ట్ చేసింది. అందుబాటులో ఉన్న వనరుల్నే ఉపయోగించుకొని తన గేమ్ స్కిల్స్ ను డెవలప్ చేసుకున్న ఆమె.. నేషనల్ లెవెల్ లో పలు పోటీల్లో పాల్గొని తనదైన క్రీడాస్ఫూర్తితో సత్తా చాటింది. ఇక ఇటీవల అంతర్జాతీయ కాంపిటీషన్‌లోనూ పాల్గొని దేశకీర్తిని విస్తరింపజేసింది అనుజ. థాయ్ ల్యాండ్ లో జరిగిన ఏషియన్ వాటర్ స్కీయింగ్ అండ్ వేక్‌బోర్డింగ్ ఛాంపియన్‌షిప్స్ లో పాల్గొన్న ఆమె.. అద్భుతమైన గేమ్ ప్రజంటేషన్ ను చేసింది. అంతేకాదు.. అంతర్జాతీయ స్థాయి వాటర్‌స్కీయింగ్ పోటీల్లో పాల్గొన్న మొదటి భారతీయురాలిగానూ చరిత్రకెక్కిందామె. దీంతో మరోసారి ఈ స్పోర్ట్స్ లవర్ పేరు వార్తల్లో నిలిచింది. గత ఏడేళ్లుగా వాటర్ స్కీయింగ్ సాధన చేస్తున్నా. ఈ క్రీడలో రాణించాలంటే శారీరక సత్తువ, ఏకాగ్రతతో పాటు శరీరాన్ని బ్యాలన్స్ చేసుకుంటూ, సమయానికి లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో ముఖ్యం. ఇక నా క్రీడా సామర్థ్యంపైనాకు పూర్తినమ్మకముంది.ఎప్పటికైనా అంతర్జాతీయ స్థాయికి వెళ్లగలనన్న నమ్మకంతోనే ముందుకు సాగా. అయితే సరైన మౌలిక సదుపాయాల్లేకపోయినా,స్థానిక జలాల్లోపరిమిత వనరుల్ని ఉపయోగించుకుంటూనే ప్రాక్టీస్ చేశా. ఇక్కడ నేను సాధన చేసిన గేర్లు వేరు. అలాంటిది థాయ్‌ల్యాండ్‌లో ప్రొఫెషనల్ సెటప్స్‌లో సాధన చేయడం, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో పోటీపడడం నా నైపుణ్యాల్ని, ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంచాయి. ఏదేమైనా అంతర్జాతీయ వాటర్‌స్కీయింగ్ పోటీల్లో తలపడిన మొదటి భారతీయురాలిగా నిలవడం సంతోషంగా ఉంది.. అంటూ అనుజా వైద్య తెలిపింది.

# ఈ చెట్టు మాట్లాడుతుంది!

అది ఐర్లాండ్ కంట్రీలోని ట్రినిటీ కాలేజ్ డబ్లిన్. పచ్చటి వాతావరణంతో నిండిన అక్కడ ఓ 200 సంవత్సరాల లండన్ ప్లేన్ చెట్టు.. దానికి యాడ్ చేసిన ఓ మెషిన్ కు ఏఐ, పర్యావరణ సెన్సర్ల సాయంతో మనుషులతో మాట్లాడుతూ సర్ ప్రైజ్ చేస్తుంది. చెట్టు జీవవిద్యుత్ సంకేతాలను మనుషుల మాటల్లోకి మార్చటం ద్వారా ఈ టెక్నాలజీ వర్క్ చేస్తుంది. జీవ విద్యుత్ సంకేతాలతో పాటు ప్రత్యక్ష పర్యావరణ సమాచారం, గాలి వేగం, మట్టి తేమ, ఆమ్ల స్థాయిలు, గాలి నాణ్యత, చుట్టుపక్కల ఉష్ణోగ్రత, కాంతి తీరు తెన్నుల వంటి వాటి సమాచారాన్నీ సెన్సర్లు కంప్లీట్ గా అంచనా వేస్తాయి. వీటిని టెక్నాలజీలోని ఏఐ గ్రహించి, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ సాయంతో మాటల్లోకి మారుస్తుంది. దీని మూలంగానే సందర్శకులతో అర్థవంతంగా మాట్లాడటం సాధ్యమవుతోంది. మనం అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వటమే కాదు.. చెట్టు తన బాధలను, ఫీలింగ్స్ ను బయటకు చెప్పటానికి హెల్ప్ అవుతుంది. అందుకే దాన్ని టాకింగ్ ట్రీ అని చెబుతున్నారు. ఇది మనిషికీ ప్రకృతికీ మధ్య డైరెక్ట్ కాన్వర్జేషన్ కు వీలు కల్పించటంతో పాటు ప్రకృతితో మన సంబంధాన్ని పునరాలోచించుకునేలానూ చేస్తోంది. టాకింగ్ ట్రీ ప్రాజెక్టు స్పెషాలిటీస్ లో ఒకటి సేకరించిన సమాచారం ప్రాసెస్ విధానం. ఎక్కువ ఇంధనం అవసరమయ్యే క్లౌడ్ కంప్యూటింగ్‌కు బదులు చెట్టుకు అమర్చిన చిన్న పరికరంలోనే అన్ని లెక్కలు జరుగుతాయి. ఇది చెట్టు పంపించే జీవవిద్యుత్ సంకేతాలను అనువాదం చేసి, అప్పటికప్పుడు మాటలుగా మారుస్తుంది. దీని కన్వర్జేషన్ ఇంటర్ఫేస్‌తో సందర్శకులు చెట్టును ప్రశ్నలు అడగొచ్చు. అప్పటి పరిస్థితిని బట్టి అది జవాబులు ఇస్తుంది. చెట్టుకు అమర్చిన ఏఐ పరికరంతో వ్యర్థాలు పెద్దగా ఉత్పత్తి కావు కూడా. అందువల్ల దీన్ని హరిత టెక్నాలజీకి మంచి ఎగ్జాంపుల్ గా భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తో భవిష్యత్ కు ముప్పు వాటిల్లుతుందని చాలామంది భావిస్తుంటారు. కానీ దీంతో ముప్పేమీ లేదని, పైగా ఇది సుస్థిరతను కాపాడుతుందనీ ఈ ప్రాజెక్టు నిరూపిస్తోంది.





ట్రినిటీ కాలేజ్ డబ్లిన్‌లో టాకింగ్ ట్రీ ఇప్పుడొక యాత్రా స్థలంగా మారింది. దీంతో మాట్లాడిన సందర్శకులు కొత్త అనుపుదీనా మొక్క మీద ప్రయోగంతో.. ట్రినిటీ కాలేజ్‌లో కన్నా ముందు ఈ పరిజ్ఞానాన్ని మోడర్న్ హాల్ పార్క్‌లో ఓ 150 ఏళ్ల చెస్ట్‌నట్ చెట్టుకూ ఫిక్స్ చేసి టెస్ట్ చేస్తున్నారు. దీనికి బీజం వేసింది పుదీనా మొక్క మీద చేసిన చిన్న ప్రయోగమే కావటం గమనార్హం. మొదట్లో పుదీనా మొక్కకు తీగలు యాడ్ చేసి దాన్నుంచి అందిన జీవవిద్యుత్ సంకేతాలను పరికరంలోని మోడల్‌కు అందజేశారు. ఆశ్చర్యకరంగా అది మాట్లాడటం మొదలెట్టింది. ఆ చిన్న ప్రయోగం ప్రకృతి గురించి విభిన్నంగా ఆలోచించేలా చేసింది. దీన్నే మరింత విస్తరించి పెద్ద చెట్లకు వర్తింపజేశారు. భవాలను పొందుతున్నారు. ఇది అర్థవంతమైంది, భావోద్వేగపూరితమైందని చెబుతున్నారు. ప్రకృతితో అసాధారణ రీతిలో చర్చించటానికిది తోడ్పడుతోందని వివరిస్తున్నారు. ఈ ప్రయోగాత్మక కార్యక్రమం ముగిసిన తర్వాతా ఈ చెట్టును చూడటానికి వస్తానని ఒక ప్రపంచ పర్యాటకురాలు అంటున్నారు. దాని మాటలు తన చెవుల్లో ఇంకా మారుమోగుతున్నాయని ఆశ్చర్యపోయారు. ప్రకృతితో భావోద్వేగ సంబంధానికి వీలు కల్పించటం ఈ ప్రాజెక్టు సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి. ఇది ప్రకృతిని మనిషిలా మార్చేసింది. దానికి మనుషుల గుణాలు కల్పించటమే కాకుండా, దాని నిజమైన, శారీరక అనుభవాలను వినగలిగేలా చేయటం నిజంగా గొప్ప విషయమే. ప్రకృతితో మన సంబంధం అత్యంత కీలకంగా మారిన ప్రస్తుత తరుణంలో ఇది సానుభూతిని, చేతనత్వాన్ని సృష్టించిందనటంలో ఎలాంటి సందేహం లేదు.

పరికరంలోని ఏఐ డేటాను ప్రసారం చేయటమే కాదు, మొత్తంగా చెట్టుకు ఓ వ్యక్తిత్వాన్నీ కట్టబెడుతుంది. మనుషుల భాషను మాట్లాడేలా చెట్టుకు నేర్పించటం దీని ఉద్దేశమని డ్రోగా 5 టెక్నాలజీ, ఇన్నోవేషన్ విభాగాధిపతి గ్రేలీ చెబుతున్నారు. అడిగిన ప్రశ్నలకు చెట్టు ఇస్తున్న జవాబులకు ఓ ఉదాహరణ ఇదీ.. విజిటర్స్.. ఈరోజు నువ్వెలా ఉన్నావు? అని అడగ్గా.. చెట్టు రెస్పాన్డ్ అవుతూ.. లేత ఎండలో సంతోషంగా ఉన్నాను. విజిటర్స్: వేసవి వడగాలులు ఎలా ఇబ్బంది పెడుతున్నాయి? చెట్టు: పొడి వాతావారణంలో దాహంతో పరితపిస్తున్నాను. ఇలా చెట్టు తన ఫీలింగ్స్ ను ఎక్స్ ప్రెస్ చేయడం అనేది సర్ ప్రైజ్ కదా. చెట్టు ఎదుర్కొంటున్న పరిస్థితులు, చుట్టుపక్కల నుంచి అందే సమాచారం మీదే దాని భావాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టే విజిటర్స్ తో ప్రకృతితో మమేకం కావటం సాధ్యమవుతుంది. వాతావరణ సమాచారం అంకెలుగా కాకుండా అనుభూతులుగా మారతాయి మరి. మాట్లాడే చెట్టు కేవలం భావోద్వేగ పూరిత మాటలకే పరిమితం కావటం లేదు. అంతేకాకుండా ఇది కార్చిచ్చుల వంటి ప్రకృతి విపత్తులను అంచనా వేయటానికి తోడ్పడగలదని సైంటిస్టులు చెబుతున్నారు. పర్యావరణ వ్యవస్థల్లో ఒత్తిడికి సంబంధించిన లక్షణాలు బయటపడటానికి చాలా ఏళ్ల ముందే దాన్ని గుర్తించటానికీ దోహదం చేయగలదని వివరిస్తున్నారు. చెట్టు మాటల రూపంలో శాస్త్రవేత్తలు విపత్తులకు సంబంధించి మొదటి హెచ్చరిక వ్యవస్థలను రూపొందించే అవకాశముందని, పర్యావరణ వ్యవస్థలతో పాటు మానవ ఆవాసాలను కాపాడటానికి వీటిని వాడుకోవచ్చని అంటున్నారు. అంటే ప్రకృతిని మాట్లాడేలా చేయటం ద్వారా పర్యావరణ పరిస్థితులనూ ఎగ్జామిన్ చేస్తుంది.

# వివో నుంచి కాంపాక్ట్ ఫోన్

దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో కాంపాక్ట్ ఫోన్ల ట్రెండ్ స్టార్ట్ అయ్యింది. రీసెంట్ గా వన్‌ప్లస్ సంస్థ 13 ఎస్‌ను తీసుకురాగా.. తాజాగా వివో X200 FE స్మార్ట్ ఫోన్ ను లాంచ్ చేసింది. పేరుకే చిన్న ఫోన్ అయినా దీంట్లో 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చడం హైలెట్. కెమెరా లవర్స్ ను టార్గెట్ చేస్తూ ఈ ఫోన్ తీసుకొచ్చారు. మరి ఈ స్మార్ట్‌ఫోన్ ధర ఎంత.. సేల్స్ ఎప్పటి నుంచి అనే కంప్లీట్ డీటైల్స్ తెలుసుకుందాం. వివో ఎక్స్ 200 ఎఫ్‌ఈ 6.31 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లే ఉంది. 120Hz రిఫ్రెష్ రేటుతో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 9,300+ ప్రాసెసర్‌ను ఫిక్స్ చేశారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15తో పనిచేస్తుంది. నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. వివో ఎక్స్ 200 ఎఫ్‌ఈలో 50 ఎంపీ





సోనీ ఐఎంఎక్స్ 921 సెన్సర్‌తో కూడిన మెయిన్ కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ పెరిస్కోపిక్ లెన్స్ ఇచ్చారు. 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ముందువైపు కూడా 50 ఎంపీ కెమెరా ఉంది. జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో తీసుకొస్తుండడం విశేషం. ఇందులో 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 90W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంది. ఐపీ 68+ ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఎన్‌ఎఫ్‌సీ, టైప్‌సి పోర్ట్ వంటివి ఉన్నాయి. ఈ ఫోన్ బరువు 186 గ్రాములు. ఫోన్‌తో పాటే ఛార్జర్‌ను, కేస్‌ను ప్రొవైడ్ చేస్తున్నారు. ఇక ధర విషయానికొస్తే.. ఇది రెండు వేరియంట్లలో వస్తోంది. 12జీబీ + 256జీబీ వేరియంట్ ధర రూ.54,999గా కంపెనీ నిర్ణయించింది. 16జీబీ + 512జీబీ వేరియంట్ ధర రూ.59,999గా కంపెనీ పేర్కొంది. యాంబర్ ఎల్లో, ఫ్రాస్ట్ బ్లూ, లక్స్ గ్రే రంగుల్లో లభిస్తుంది. వివో ఇండియా వెబ్‌సైట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో జులై 23 నుంచి సేల్స్ స్టార్ట్ అవుతాయి. నేటి నుంచి ప్రీ బుకింగ్స్ ప్రారంభమవుతాయి. ఎంపిక చేసిన కార్డులపై రూ.6వేలు డిస్కౌంట్ లేదా రూ.6 వేలు ఎక్స్ఛేంజీ బోనస్ కింద లభిస్తుంది.

# మహిళల్లో థైరాయిడ్ వస్తే ఎలా గుర్తించాలి?



థైరాయిడ్ అనేది మెడలో ఉండే ఒక చిన్న గ్రంథి. ఇది శరీర జీవక్రియలను కంట్రోల్ చేసే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. కానీ.. ఈ హార్మోన్ల ఉత్పత్తిలో తేడా వచ్చినప్పుడు, థైరాయిడ్ సమస్యలు వస్తాయి. పురుషులతో పోలిస్తే మహిళల్లో థైరాయిడ్ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ సమస్య మెయిన్‌గా రెండు రకాలుగా ఉంటుంది. హైపోథైరాయిడిజం.. అంటే థైరాయిడ్ హార్మోన్లు తక్కువగా ఉత్పత్తి అవడం. వీటి లక్షణాలు అంటే హార్మోన్లు తక్కువగా ఉన్నప్పుడు అలసట, నీరసంగా ఉంటాయి. ఇది హైపోథైరాయిడిజం యొక్క అత్యంత సాధారణ లక్షణం. సరైన నిద్ర ఉన్నప్పటికీ కూడా నిరంతరం అలసటగా అనిపిస్తుంది. అంతేకాకుండా సరైన ఆహారం తీసుకుంటున్నా.. వ్యాయామం చేస్తున్నా కూడా బరువు పెరుగుతారు. చల్లని వాతావరణాన్ని తట్టుకోలేకపోవడం, ఎక్కువ చలిగా అనిపించడం. జీర్ణక్రియ నెమ్మదిగా జరగడం వల్ల మలబద్ధకం సమస్య వస్తుంది. రుతుస్రావం అధికంగా లేదా క్రమరహితంగా ఉండవచ్చు. డిప్రెషన్ అండ్ మానసిక స్థితిలో మార్పులు కూడా అధికంగా ఉంటాయి. విచారంగా, నిరుత్సాహంగా లేదా డిప్రెషన్‌తో బాధపడటం. కీళ్లు, కండరాల నొప్పులు.. చేతులు, కాళ్లు, కీళ్లలో నొప్పి, కండరాల బలహీనత. హైపర్‌థైరాయిడిజం లక్షణాలు అంటే హార్మోన్లు అధికంగా ఉన్నప్పుడు.. ఉన్నట్టుండి బరువు తగ్గడం. ఆహారపు అలవాట్లలో మార్పు లేకపోయినా బరువు వేగంగా తగ్గుతారు. గుండె దడ, హృదయ స్పందన రేటు పెరగడం. దీంతో పాటు మానసిక అశాంతి, ఆందోళన, చిరాకుగా ఉండటం. వేడి వాతావరణాన్ని తట్టుకోలేకపోవడం, ఎక్కువ చెమటలు పట్టడం. చేతులు లేదా వేళ్లు వణకడం. నిద్ర పట్టకపోవడం లేదా నిద్రలో తరచుగా మెలకువ రావడం. రుతుస్రావం తక్కువగా లేదా అసలు రాకపోవడం. తరచుగా ప్రేగు కదలికలు లేదా విరేచనాలు. ఇలాంటి లక్షణాలు మీలో ఏవైనా కనిపిస్తే.. వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. థైరాయిడ్ సమస్యలను సరైన సమయంలో గుర్తించి.. చికిత్స తీసుకుంటే ఈజీగా కంట్రోల్ చేయొచ్చు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చూస్తే.. థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ టెస్ట్ చేయించుకోవడం ద్వారా థైరాయిడ్ సమస్యను నిర్ధారించుకోవచ్చు. థైరాయిడ్ సమస్య ఉన్నవారు వైద్యుల సలహా మేరకు సరైన ఆహారం తీసుకోవడం ముఖ్యం. అయోడిన్ అధికంగా ఉండే ఆహారం థైరాయిడ్ ఆరోగ్యానికి అవసరం. అలాగే శారీరక శ్రమ జీవక్రియను మెరుగుపరచి, థైరాయిడ్ పనితీరుకు సహాయపడుతుంది. ఒత్తిడి థైరాయిడ్ సమస్యలను మరింత పెంచుతుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి.

# ఓర్నీ ఏసాలో.. వైరల్ వీడియోపై నెటిజన్స్ ఫైర్

రోడ్డు మీద వెహికల్స్ నడిపేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలంటారు. ఎందుకంటే మనం అజాగ్రత్తగా వాహనం నడిపినా, ఎదుట వచ్చే వాహనదారులకు అన్యాయంగా యాక్సిడెంట్స్ అవుతూ ఉంటాయి. ఆ కుటుంబం రోడ్డున పడినా మీరే బాధ్యులు అవుతారు. తప్పు ఎవరిదైనా ఇద్దరూ నష్టపోతారు. అందుకే వాహనం తీసుకుని రోడ్డెక్కినప్పుడు బాధ్యతగా మెలగాలంటారు. అయితే, ఇవన్నీ పక్కనపెట్టి రోడ్డు మీద స్టంట్స్ చేయాలని ఆలోచించే కొంతమంది ఉన్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు రకరకాల స్టంట్స్ చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుంటారు. అలాంటి ఒక వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియలో వైరల్ అవుతుంది. ఒక వ్యక్తి అద్భుతమైన రీతిలో ట్రాలీ ఈరిక్షా నడుపుతున్నట్లు కనిపిస్తుంది. దాన్ని చూసిన తర్వాత నెటిజన్స్ షాక్ అవుతున్నారు. ట్రాలీ ఈరిక్షా డ్రైవర్ తన వాహనంలోని ఓపెన్ రూఫ్‌ను ఆస్వాదిస్తున్నట్లు వీడియోలో కనిపిస్తుంది. అతను తన రిక్షాను పడుకుని నడుపుతున్నట్లు కనిపిస్తుంది. దీన్ని చూసిన తర్వాత అందరూ ఆశ్చర్యపోతున్నారు ఎందుకంటే అతను హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ లేకుండానే కాకుండా ఎటువంటి భయం లేకుండా రిక్షాను కంట్రోల్ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ వీడియో చూసిన తర్వాత, ప్రజలు అతని శైలిని ఇష్టపడుతుండగా, ఈ ఫీట్‌ను చాలా ప్రమాదకరమని కొందరు అంటున్నారు. వీడియోలో, ఒక వ్యక్తి తన ఇరిక్షాను నిర్లక్ష్య శైలిలో నడుపుతున్నట్లు మీరు చూడవచ్చు. అతను అతి వేగంతో నడుపుతున్నాడు. ఇది అతని రోజువారీ పనిలా ఉంది. ఆశ్చర్యకరంగా, హైవేపై అధిక వేగంతో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు అతని ముఖంలో ఎలాంటి భయం లేదు. అతన్ని చూస్తుంటే మంచం మీద పడుకుని సూర్యరశ్మిని ఆస్వాదిస్తున్నట్లు అనిపిస్తుంది. ఈ





వీడియోపై నెటిజన్స్ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. బ్రదర్, ఈ వ్యక్తి ఇతరుల ప్రాణాలతో పాటు తన ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నాడని ఒక నెటిజన్ రాశారు. మరొకరు అతను తన టాలెంట్‌ని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నాడని, తరువాత అతనికి చెడ్డ పేరు వస్తుందని రాశారు. ఏది ఏమైనా ఇలాంటి స్టంట్స్ పబ్లిక్ లో చాలా ప్రమాదాలకు దారి తీస్తాయి.




# భారత్ ఘోర ఓటమి

ఇంగ్లాండ్‌తో మూడో టెస్ట్ మ్యాచ్ లో భారత్ పోరాడి ఓడింది. 193 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన భారత్ 170 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 22 రన్స్ తేడాతో ఓటమి పాలైంది. చివరి రోజు మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. ఇంగ్లీష్ బౌలర్లు పైచేయి సాధించారు. చేతిలో 6 వికెట్లతో 135 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా 170 పరుగులకే పరిమితమైంది. రవీంద్ర జడేజా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఓపక్క వికెట్లు పడిపోతున్నా, అంతా ఔట్ అవుతున్నా.. పోరాట పటిమ చూపించాడు. ఒంటరి పోరాటం చేశాడు. కానీ ఓటమిని తప్పించలేకపోయాడు. రవీంద్ర జడేజా హాఫ్ సెంచరీతో అజేయంగా నిలిచాడు. 181 బంతులు ఎదుర్కొని 61 పరుగులు చేశాడు. 4ఫోర్లు, ఒక సిక్స్ కొట్టాడు. ఇంగ్లీష్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. కార్సే 2 వికెట్లు తీశాడు. క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్ తలో వికెట్ తీశారు. ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 387 పరుగులు చేయగా, భారత్ కూడా 387 పరుగులే చేసింది. సెకండ్ ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 192 పరుగులు చేయగా, భారత్ 170 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఈ గెలుపుతో 5 టెస్టుల సిరీస్ లో ఇంగ్లాండ్ 21 ఆధిక్యం సాధించింది. కాగా నాలుగో టెస్ట్ మ్యాచ్ జూలై 23 నుంచి ప్రారంభం కానుంది.

# ఐసీసీకి రిక్వెస్ట్ చేసిన మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే!



క్రికెట్ రూల్స్‌లో మార్పులు తీసుకురావాలని మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే డిమాండ్ చేశారు. సలైవా వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని, డ్యూక్ బంతి నాణ్యతను మెరుగుపరచాలని ఐసీసీకి రిక్వెస్ట్ చేశారు. ఇంగ్లండ్‌భారత్ మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతున్న నేపథ్యంలో.. డ్యూక్ బంతిపై వివాదం తలెత్తింది. ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌తో కుంబ్లే మాట్లాడుతూ.. బంతి మృదువుగా మారడం లేదంటే మార్చాల్సిందేనని చెప్పాడు. బంతి పది ఓవర్లు నిలబడకపోతే బంతిని తరుచుగా మార్చడం సరికాదు. క్రికెట్‌కు మాత్రమే కాదు బంతికి కూడా అని పేర్కొన్నారు. పది ఓవర్ల మ్యాచ్ తర్వాత బంతిని మార్చడంపై టీమిండియా ప్లేయర్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లార్డ్స్‌లో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ రెండోరోజు ఉదయం సెషన్ లో రెండుసార్లు బంతిని మార్చారు. కేవలం పది ఓవర్ల ఆట తర్వాత బంతిని మార్చడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ మాట్లాడుతూ గతంలోని తయారీ ప్రమాణాల మేరకు బంతిని తీసుకురావడం ఓ పరిష్కారం కావొచ్చని పేర్కొన్నారు. డ్యూక్ బంతి పాత వెర్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌కు సపోర్ట్‌ను తెలిపారు. ఐదేళ్ల కిందట అందుబాటులో ఉన్న దాన్ని తిరిగి తీసుకురావడం న్యాయమని తాను భావిస్తున్నానని మాజీ హెడ్‌కోచ్ తెలిపాడు. సలైవా వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే డిమాండ్ చేశారు. బంతిని మెరుస్తూ లాలాజలం వాడకంపై నిషేధాన్ని ఎత్తివేయాలని కుంబ్లే ఐసీసీని కోరారు. ఇది బౌలర్లకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.




# సిరాజ్ కి ఫైన్.. గిల్ ఎస్కేప్..

టెస్ట్ క్రికెట్‌లో ప్లేయర్స్ ఒకరిపై ఒకరు దూసుకెళ్లడం, తిట్టుకోవడం, రెచ్చగొట్టుకోవడం లాంటివి చూస్తూనే ఉంటాం. అయితే ఏదైనా నిబంధనలకు లోబడి ఉంటే ఓకే. కానీ రూల్స్ దాటితే మాత్రం ఐసీసీ తప్పకుండా శిక్షిస్తుంది. లార్డ్స్ టెస్ట్‌లో ఇదే జరిగింది. ఇంగ్లండ్ సెకండ్ ఇన్నింగ్స్ టైమ్ లో బెన్ డకెట్‌ను ఔట్ చేశాక అతడి పైకి దూసుకెళ్తూ ఏదో కామెంట్ చేశాడు భారత స్పీడ్‌స్టర్ మహ్మద్ సిరాజ్. డకెట్ వైపు సీరియస్‌గా చూస్తూ ఏదో అనడంతో ఐసీసీ ఈ ఘటనపై విచారణ జరిపి అతడికి జరిమానా విధించింది. కానీ కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను మాత్రం వదిలేసింది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని లెవల్ 1 నిబంధనను క్రాస్ చేయడంతో సిరాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు అధికారులు. అయితే ఇదే మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటింగ్ సమయంలో భారత కెప్టెన్ గిల్ కూడా దూకుడుగా వ్యవహరించాడు. ఆట మూడో రోజు చివర్లో జాక్ క్రాలే మీద అతడు సీరియస్ అయ్యాడు. గాయం సాకు చూపి ఆటను ఆలస్యం చేయడంతో క్రాలే మీదకు దూసుకెళ్లిన గిల్.. వేళ్లు చూపిస్తూ అతడికి వార్నింగ్ ఇచ్చాడు. దమ్ముంటే ఆడమంటూ క్రాలేడకెట్‌కు చాలెంజ్ విసిరాడు. అయితే ఇంత జరిగినా సిరాజ్‌కు జరిమానా విధించిన ఐసీసీ.. గిల్‌ను మాత్రం వదిలేసింది. దీనిపై ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు, ఆ జట్టు అభిమానులు సీరియస్ అవుతున్నారు. నిబంధనల అమలు విషయంలో ఐసీసీ కచ్చితత్వంతో వ్యవహరించాలి. ఒకరి విషయంలో ఒకలా, మరొకరి విషయంలో మరోలా ఉండకూడదు. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్ష విధించాలి. బ్యాటర్‌ను ఏదో అన్నాడనే కారణంతో అతడికి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. మరి.. టీవీల్లో అందరూ చూస్తుండగా బ్యాటర్‌కు వార్నింగ్ ఇచ్చిన గిల్ పరిస్థితేంటి? ఇలా చేయడం సరికాదు అని ఇంగ్లండ్ దిగ్గజ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ స్పష్టం చేశాడు.

# ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరన్..




ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ టీమ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. ముఖ్యంగా 2024 లో ఈ టీమ్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి ఫైనల్ కి చేరుకుంది. కానీ ఫైనల్ లో అద్భుతమైన ఫామ్ లో ఉన్న కోల్ కతా నైట్ రైడర్స్ ని ఢీ కొట్టలేకపోయింది. దీంతో సన్ రైజర్స్ రన్నరప్ గా నిలిచింది. ఈ సీజన్ లో సన్ రైజర్స్ ఓనర్ కావ్య కీలక బౌలర్ భువనేశ్వర్ కుమార్ ని వదులుకుంది. ఇక 2026 ఐపీఎల్ కోసం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్ బిగ్ స్కెచ్ వేయనుంది. టీమిండియా మాజీ బౌలర్ వరుణ్ అరోణ్ ని కోచ్ గా నియమించుకోనుంది. కొత్త బౌలింగ్ కోచ్ గా వరుణ్ అరోన్ ని తీసుకొని బౌలింగ్ లో రాటుదేలాలని భావిస్తోంది కావ్య. గత సీజన్ లో అద్భుతంగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్ కుమార్ ని అస్సలు ఎందుకు వదిలేసుకుందో అని అందరూ మాట్లాడుకున్నారు. భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ లో అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. హైదరాబాద్ విజయాల్లో గత ఏడేనిమిది సీజన్లలో కీలక బౌలర్ గా కొనసాగాడు. సన్ రైజర్స్ విజయాల్లో కీ రోల్ ప్లే చేశారు. కేవలం అభిషేక్ శర్మ, క్లాసెన్ వంటి హిట్ బ్యాటర్లు ఆడినప్పుడు మాత్రమే సన్ రైజర్స్ హైదరాబాద్ విజయం సాధిస్తుంది. గత సీజన్ కి ఈ సీజన్ కి తేడా బౌలింగ్ మాత్రమే. బౌలింగ్ లో ఎప్పుడైనా హైదరాబాద్ జట్టు అద్భుతంగా ఉండేది. కానీ ఈ సారి బౌలింగ్ లో కాస్త తడబడిందనే చెప్పాలి. బౌలర్లు వికెట్లు తీయలేక ఇబ్బందులు పడ్డారు. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ రెండింటిలో రాణించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 2025 ఐపీఎల్ ట్రోఫీ అందుకుంది. వచ్చే సీజన్ లో బౌలింగ్ విభాగాన్ని బలపరిచేందుకు కావ్య మారన్ కొత్త కొత్త వ్యూహాలు రచిస్తోంది. అలాగే ఫారెన్ కి చెందిన ఓ మంచి బౌలర్ ను కూడా వేలంలో తీసుకోవాలని భావిస్తోందట. ఏది ఏమైనా ఈ సారి ఐపీఎల్ కి గట్టి ప్లానింగ్ ఉందని అర్థమవుతుంది.

# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ కు ముందు వేలం ప్రక్రియ షురూ

అయింది. ఈసారి వేలంలో ఏకంగా 520 మంది ఆటగాళ్లు అదృష్టం పరీక్షించుకున్నారు. ఆల్‌రౌండర్ల కోసం ఫ్రాంచైజీలు తీవ్రంగా పోటీపడుతున్నాయి. వేలంలో ఆల్‌రౌండర్లు జాక్‌పాట్ కొడుతున్నారు. పైలా అవినాష్‌ను రూ.11.5 లక్షలకు రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు దక్కించుకుంది. పీవీ సత్యానారాయణ రాజును రూ.9.8 లక్షలకు సొంతం చేసుకుంది భీమవరం బుల్స్ టీమ్. త్రిపురాన విజయ్‌ను రూ. 7.55 లక్షలు పెట్టి దక్కించుకుంది సింహాద్రి వైజాగ్ లయన్స్. సౌరభ్ కుమార్‌ను రూ.8.80 లక్షలకు సొంతం చేసుకుంది తుంగభద్ర వారియర్స్ జట్టు. యర్రా పృథ్వీరాజ్‌ను రూ.8.05 లక్షల ధరకు దక్కించుకుంది విజయవాడ సన్ షైనర్స్. జి.మనీష్ రూ.3.45 లక్షల ధర పలికాడు. అతడ్ని కాకినాడ కింగ్స్ జట్టు కొనుక్కుంది. పి.గిరినాథ్ రెడ్డి రూ.10.05 లక్షల ధర పలికాడు. అతడ్ని రాయలసీమ రాయల్స్ టీమ్ సొంతం చేసుకుంది. ఎమ్.ధీరజ్ కుమార్‌ను రూ.6.05 లక్షలకు దక్కించుకుంది విజయవాడ సన్ షైనర్స్. పి.తపస్వీని రూ.5.30 లక్షలు పోసి తమ జట్టులోకి తెచ్చుకుంది కాకినాడ కింగ్స్. కాగా, ఏపీఎల్ సీజన్4లో అమరావతి రాయల్స్, విజయవాడ సన్ షైనర్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ, తుంగభద్ర వారియర్స్, సింహాద్రి వైజాగ్ వారియర్స్, కాకినాడ కింగ్స్, భీమవరం బుల్స్.. ఇలా 7 జట్లు పాల్గొంటున్నాయి.





# రిషభ్ మాస్ లైనప్..

కాంతారా సినిమాతో నేషనల్ అవార్డ్ అందుకున్న కన్నడ స్టార్ రిషభ్ శెట్టి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ప్రజంట్ ఆయన బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ లైనప్ లో సెట్ చేసుకున్నారు. ఈ సినిమాలన్నీ సాంస్కృతిక, చారిత్రక ఇతిహాసాలు, పౌరాణికం జానర్ లో వస్తున్నాయి. ఈ సినిమాలతో రిషభ్ రానున్న ఐదేళ్లు ఫుల్ బిజీబీజీగా గడపనున్నారు. మరి ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్ లు ఏంటి? వాటి డీటైల్స్ ఏంటి అనేది ఇప్పుడు చూద్దాం. 2022లో రిషభ్ సొంత దర్శకత్వంలో వచ్చిన కాంతారా సెన్సేషనల్ హిట్ అయింది. ఇప్పుడు రిషభ్ ప్రస్తుతం కాంతారా ప్రీక్వెల్ చేస్తున్నారు. ఇది కూడా ఆయనే తెరకెక్కిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ బ్యానర్ పై ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా 2025 అక్టోబర్ 2న థియేటర్లలో రిలీజ్ కానుంది. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న సినిమా జై హనుమాన్. 2024లో హనుమాన్ సినిమాతో భారీ హిట్ అందుకున్న ప్రశాంత్ పై అంచనాలు పీక్స్ లో ఉన్నాయి. రీసెంట్ గా రిషభ్ పుట్టిన రోజు సందర్భంగా పోస్టర్ కూడా రిలీజ్ అయ్యింది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్, రవి రూపొందిస్తున్నారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా రిషభ్ లీడ్ రోల్ లో ఓ సినిమా తెరకెక్కుతుంది. ఇందులో రిషభ్ ది ప్రైడ్ ఆఫ్ భారత్ గా పిలుచుకునే శివాజీ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో శివాజీ నాయకత్వం, ఆయన వారసత్వం జానర్ లో తెరకెక్కుతుంది. ఇది పాన్ఇండియా లెవెల్ లో రూపొందుతుంది. ఈ సినిమాకు సందీప్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇది 2027 జనవరిలో విడుదలయ్యే ఛాన్స్ ఉంది. రిషభ్ చేతిలో ఉన్న మరో సినిమా 1770 మూవీ కూడా రాబోతుంది. ఇది బంకింమ్ చంద్ర ఛటర్జీ నవల ఆనందమత్ ఆధారంగా ఈ కథను ఫిక్స్ చేశారు. దీనికి ఆకాశవాణి ఫేమ్ అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రూపొందుతుంది. వలసవాద వ్యతిరేక ఘటన, తిరుగుబాటు నేపథ్యంమే ఈ సినిమా కథ. ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ప్రముఖ దర్శకుడు అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలోనూ రిషభ్ నటిస్తున్నారు. ఇది శ్రీ కృష్ణదేవరాయల బయోపిక్ ఆధారంగా తెరకెక్కుతోంది. గతంలో అశుతోష్ లగాన్, జోధా అక్బర్ వంటి పీరియాడికల్ డ్రామాలకు దర్శకత్వం వహించారు. విష్ణు వర్ధన్ ఇందూరి ఈ సినిమాని ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇలా హీరో రిషభ్ భారతదేశ ఆధ్యాత్మిక, పౌరాణిక, చారిత్రక అంశాలతో ముడిపడి ఉన్న స్టోరీస్ తో ప్రేక్షకులను అలరించనున్నారు. ప్రతీ సినిమా వేరే యుగం, ఆధ్యాత్మిక అంశాల ఆధారంగా తెరకెక్కనుండడంతో ఆయనకు భారత సంస్కృతి పై ఉన్న గౌరవం అర్థమవుతోంది. అంతేకాకుండా రిషభ్ టేకోవర్ చేస్తున్న ప్రాజెక్ట్స్ పై కూడా భారీస్థాయిలో అంచనాలు క్రియేట్ అయ్యాయి.


# జాన్వీ కపూర్ మ్యారేజ్ పై ఓపెన్?



బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయింది. కానీ ఆమె యాక్ట్ చేసిన సినిమాలకు కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. దీంతో ఆమె దేవర మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో ఆమె పాన్ ఇండియా స్థాయిలో ఇంట్రడ్యూస్ అయ్యారు. అంతేకాకుండా ఆమె సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ లేటెస్ట్ ఫోటో షూట్స్ తో స్టార్ డమ్ ను తెచ్చిపెట్టాయి. ఇక జాన్వీ కపూర్ ప్రజంట్ రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబో మూవీలో నటిస్తున్న విషయం తెల్సిందే. జాన్వీ కపూర్ ప్రేమలో ఉందనే వార్తలు చాలా రోజులుగా వస్తున్నాయి. ఆమె బాయ్ ఫ్రెండ్ శిఖర్ తో కలిసి చాలా సందర్భాల్లో జాన్వీ కపూర్ కారులో, ప్రైవేట్ పార్టీల్లో కనిపించింది. అయితే ఇప్పటి వరకు అఫిషియల్ గా మాత్రం తాము ఇద్దరం ప్రేమలో ఉన్నామనే విషయాన్ని చెప్పలేదు. కానీ ఇద్దరూ ఉంటున్న క్లోజ్ పిక్స్‌ను చూస్తే ఖచ్చితంగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు, త్వరలోనే పెళ్లి చేసుకునే అవకాశాలు కూడా ఉన్నాయని చాలా మంది బలంగా నమ్ముతున్నారు. తాజాగా మరోసారి జాన్వీ కపూర్ తన ప్రియుడితో కనిపించింది. మరోసారి ఆ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అయితే ఈసారి జాన్వీ కపూర్ వేసుకున్న డ్రెస్ పై శిఖర్ అని ఉండటంతో హాట్ టాపిక్ గా మారింది. సాధారణంగా హీరోయిన్స్ ఎవరైనా సరే.. తమ ప్రేమ విషయాన్ని రహస్యంగా ఉంచాలి అనుకుంటే కనీసం పేరును సోషల్ మీడియాలో కూడా మెన్షన్ చేయరు, ఒక్క ఫోటో బయటకు రానివ్వరు. కానీ జాన్వీ కపూర్ మాత్రం శిఖర్ పేరు ఉన్న టీ షర్ట్‌ను ధరించడంతో అంతా షాక్ అవుతున్నారు. బాబోయ్ జాన్వీ కపూర్ మరీ ఇంత ఓపెన్‌గా శిఖర్‌తో ఉన్న రిలేషన్ గురించి చెప్పేసింది ఏంటి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. జాన్వీ కపూర్ ధరించిన టీ షర్ట్ గురించి ప్రస్తుతం తెగ వైరల్ అవుతుంది. ఆమె టీ షర్ట్ ధరించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏంటి అని చాలామంది అడుగుతున్నారు. ఆమె మాత్రం ఆ విషయమై నోరు విప్పేందుకు ఇంట్రెస్ట్ చూపించడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న జాన్వీ కపూర్ ప్రేమ, పెళ్లి అంటే ఖచ్చితంగా కెరీర్ పై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. అందుకే జాన్వీ కపూర్ ప్రస్తుతానికి ప్రేమ విషయాన్ని రహస్యంగా ఉంచుతుందేమో అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇక జాన్వీ కపూర్ ఇప్పటికే మరో రెండు సినిమాలు కమిట్ అయిందనే వార్తలు వస్తున్నాయి. అందులో ఒకటి అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న మూవీ అనే రూమర్స్ తెగ స్ప్రెడ్ అవుతున్నాయి. ఆ సినిమాలో నలుగురు ఐదుగురు హీరోయిన్స్ కనిపించబోతున్నారని, అందులో జాన్వీ కపూర్ ఒక హీరోయిన్‌గా నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరోకు జోడీగా తెలుగులో నటించేందుకు గాను జాన్వీ కపూర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## కింగ్డమ్ లో బ్రదర్ సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందా?

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ సినిమా కింగ్డమ్. ఈ సినిమా కోసం ప్రేక్షకులు, విజయ్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమా ఎలా ఉండబోతుందా అనే ఇంట్రెస్ట్ అందరిలో క్రియేట్ అయ్యింది. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ఆకట్టుకునేవిధంగా ఉండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ కొత్తఅప్డేట్ మేకర్స్ ఇచ్చారు. ఈ సినిమా నుండి సెకండ్ సింగిల్ సాంగ్ గా అన్న అంటేనే.. అనే ఓ ఎమోషనల్ పాటను రిలీజ్ చేయబోతున్నట్లు ఫిల్మ్ యూనిట్ అనౌన్స్ చేసింది. దీనికి సంబంధించి ఓ పోస్టర్ కూడా ఫిల్మ్ టీమ్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో హీరో చిన్నప్పుడు తన సోదరుడితో కలిసి దిగిన ఫోటోను మనకు చూపెట్టారు. కాగా ఈ సినిమాలో హీరో సోదరుడిగా సత్య దేవ్ నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పాటకు సంబంధించిన ప్రోమోను జూలై 15న సాయంత్రం 5.05 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు సినిమా యూనిట్ తెలిపింది. ఇక ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. దీంతో ఈ సినిమా మ్యూజికల్ హిట్ కావడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సె హీరోయిన్ గా నటిస్తుండగా ఈ సినిమాని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఈ సినిమాని జూలై 31న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ పవర్ ఫుల్ క్యారెక్టర్ తో మన ముందుకు రాబోతున్నారు. అంతేకాకుండా ఈ సినిమాలో ఆయనకున్న క్రేజ్ కూడా పెరగబోతుంది. ఇక విజయ్ కు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ రావడంతో ఈ సినిమాపైనే భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను తెచ్చిపెడుతుందో చూడాలి.




## జూనియర్ కోసం శ్రీలీల భారీ రెమ్యునరేషన్

టాలీవుడ్‌లో తెరకెక్కిన లేటెస్ట్ సినిమా జూనియర్ రిలీజ్ కు రెడీ అయింది. కిరీటి హీరోగా ఇంట్రొడ్యూస్ అవుతున్న ఈ సినిమాను రాధాకృష్ణ డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా యాక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయింది. దీనికి తోడు ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యేలా చేసింది. అయితే, ఈ ప్రాజెక్ట్ యాక్ట్ చేయడానికి ఎన్నడూ లేని రీతిలో శ్రీలీల ఓ రేంజ్ ఆఫ్ రెమ్యునరేషన్ ను ఎక్స్ పెక్ట్ చేసిందట. దీంతో మొదట్లో మేకర్స్ కాస్త ఆలోచించినా.. శ్రీలీల ఉంటే సినిమాకు ప్లస్ అవుతుందని ఆమె కోరిన రెమ్యునరేషన్ ను మేకర్స్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తుంది. అందుకే జూనియర్ మూవీ కోసం శ్రీలీల ఏకంగా రూ.2.5 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. శ్రీలీలకు ఉన్న క్రేజ్, డిమాండ్ కారణంగా ఆమె ఇంత మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకుందని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో జెనీలియా మరో కీ రోల్ ను ప్లే చేస్తున్నారు. రీసెంట్ గా జరిగిన ఈవెంట్ లో కూడా ఆమె మాట్లాడుతూ.. సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ చేశారు. ఇక జూనియర్ మూవీ నుండి వయ్యారి సాంగ్ కూడా నెట్టింట తెగ ట్రెండ్ అవుతుంది. ఈ సాంగ్ లో మరోసారి శ్రీలీల తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంది. ఆమె డాన్స్ తో కుర్రకారును ఊపేస్తుంది. ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా సాయి కొర్రపాటి ప్రొడ్యూస్ చేశారు. జూలై 18న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



## ఉస్తాద్ లో మరో కెవ్వు కేక కన్ఫర్మ్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన పొలిటికల్ సెటిల్ మెంట్ తర్వాత కాస్త రిలాక్స్ అయ్యారు. అందుకే ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వెయిటింగ్ లో ఉంచిన బ్యాక్ టు బ్యాక్ మూవీస్ ని కంప్లీట్ చేసే పనిలో పడ్డారు. రీసెంట్ గానే హరిహరవీరమల్లు మూవీని కంప్లీట్ చేసుకున్నారు. ఈ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు. ఆ తర్వాత హరీష్ శంకర్ కాంబోలో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ మళ్లీ షూటింగ్ సందడి మొదలైంది. ఈమధ్యనే పవన్ కళ్యాణ్ ఈ సినిమా షూటింగ్ కి ఓకే చెప్పారు. రీసెంట్ గా కొద్ది రోజులు షూట్ కూడా జరిగిందని టాక్. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుందని తెలుస్తుంది. పవన్ కళ్యాణ్ అభిమానిగా హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ ని వేరే లెవెల్ లో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా మరోసారి గబ్బర్ సింగ్ ని గుర్తు చేసేలా చేస్తున్నారట. గబ్బర్ సింగ్ ఆల్బం బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ తో ఆ సినిమాలోని సాంగ్స్ అన్నీ సూపర్ హిట్ అయ్యాయి. ముఖ్యంగా ఆ సినిమాలో కెవ్వు కేక సాంగ్ ఉర్రూతలూగించింది. ఐతే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా అలాంటి ఒక స్పెషల్ సాంగ్ ని పెడుతున్నట్టు తెలుస్తుంది. పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో కూడా పోలీస్ క్యారెక్టర్ లో యాక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా మెయిన్ స్టోరీని దళపతి విజయ్ తెరి నుంచి తీసుకున్నారు. దర్శక రచయిత దశరథ్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్ యాక్షన్, డైలాగ్స్, పవన్ స్క్రీన్ ప్రెజెన్స్ ఇవన్నీ ఒక రేంజ్ లో ఉండబోతాయని తెలుస్తుంది. వీటితో పాటుగా దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ కూడా బాగుంటుందని అంటున్నారు. గబ్బర్ సింగ్ తరహాలో కెవ్వు కేక సాంగ్ లాంటిది మరోటి పెడుతున్నారట. తప్పకుండా ఈ సాంగ్ మరోసారి ఫ్యాన్స్ ని షేక్ ఆడిస్తుందని అంటున్నారు. పవన్ కళ్యాణ్ వీరమల్లు సినిమా ఈ నెల 24న రిలీజ్ అవుతుంది. ఈ సినిమా తర్వాత సుజీత్ డైరెక్షన్ లో వస్తున్న ఓజీ కూడా సెప్టెంబర్ 25న రిలీజ్ ఫిక్స్ చేశారు. సో ఈ ఇయర్ పవర్ స్టార్ ఫ్యాన్స్ కి డబుల్ ధమాకా అని చెప్పొచ్చు. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా కూడా నెక్స్ట్ ఇయర్ ఫస్ట్ హాఫ్ లోనే రిలీజ్ ఉంటుందని తెలుస్తుంది. ఇక పవన్ కళ్యాణ్ నెక్స్ట్ ప్రాజెక్ట్స్ విషయంలో కూడా ఆయన ఫ్యాన్స్ కొన్ని ఎక్స్ పెక్టేషన్స్ పెట్టుకున్నారు. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం ముందుగా ఈ సినిమాల్ని కంప్లీట్ చేయాలనే చూస్తున్నారట.

